ప్రజాశక్తి

శుక్రవారం 17 జనవరి 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

కౌన్సిలా? క్యాన్సిలా?

- తొలగని ప్రతిష్టంభన - నేడు సమావేశానికి సిద్ధమైన వైసిపి
- స్టాండింగ్ కౌన్సిల్ నోటిఫికేషన్ జారీ చేసిన కమిషనర్
- సాంకేతికంగా 3వ తేదీ వరకు కుదరదంటున్న అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి



గుంటూరు నగర పాలక సంస్థ రాజకీయం రసకందాయంలో పడింది. గుంటూరు కౌన్సిల్ భేటిపై ఏర్పడిన ప్రతిష్టంభన కొనసాగుతోంది. పాలకవర్గానికి, కమిషనర్‌కు మధ్య అగాధం ఎప్పటికి తొలగిపోతుంది...? కౌన్సిల్ సమావేశం ఎప్పుడు జరుగుతుంది...? పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు ఆమోదం ఎప్పటికి లభిస్తుందో..? తెలియని పరిస్థితి నెలకొంది.

ఏజెండాలో 99 ప్రశ్నలు, అభివృద్ధి పనులకు 361 ప్రతిపాదనలతో గతనెల 20న జరిగిన కౌన్సిల్ సమావేశం కేవలం 23 ప్రశ్నలతోనే ముగిసింది. తిరిగి ఈనెల 4న కౌన్సిల్ సమావేశంలో పెద్ద ఎత్తున గలాభా చోటుచేసుకోవడంతో మేయర్ కావటి మనోహర్ నాయుడు సమావేశాన్ని వాయిదా వేశారు. 99 ప్రశ్నలకు గాను 4వ తేదీ నాటికి కేవలం 31 ప్రశ్నలపైనే చర్చ జరిగింది. తిరిగి ఈనెల 17న సమావేశం నిర్వహణకు మేయర్ కమిషనర్‌కు ఈనెల 7న లేఖ రాయగా ఇంత వరకు కమిషనర్ సానుకూలంగా స్పందించలేదు. అయితే శుక్రవారం తాము సమావేశానికి వస్తామని అధికారులు వస్తారో? రారో? వేచి చూస్తామని మేయర్ మనోహర్ నాయుడు గురువారం వైసిపి కార్పొరేటర్ల సమావేశంలో ప్రకటించారు. కమిషనర్ వ్యవహారంపై గుర్రుగా ఉన్న వైసిపి సమావేశం నిర్వహణకు పెద్దఎత్తున నిరసన తెలపాలని యోచిస్తోంది.

స్థానిక సంస్థలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను అధికారులు హరించి వేస్తున్నారనే కారణంతో కోర్టులో కూడా సవాల్ చేయాలని యోచిస్తున్నారు. అంతేగాక రాష్ట్ర

▶ 2లో

బజారు భాష వాడారు : కమిషనర్

కౌన్సిల్ సమావేశంలో కొంత మంది కార్పొరేటర్లు బజారుభాష వాడుతున్నారని కమిషనర్ పులి శ్రీనివాసులు వ్యాఖ్యానించారు. ఈనెల 4వ తేదీన జరిగిన సమావేశంలో చోటుచేసుకున్న అంశాలపై గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫిక్స్‌డ్ డిపాజిట్ల అంశంపై వేసిన ప్రశ్నను తాను ఏజెండాలోకి అనుమతించానని, గతంలో ఉన్న కమిషనర్లు ఈ ప్రశ్నలను అనుమతించలేదని అన్నారు. తాము ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందకపోతే వేరే ఫార్మెట్‌లో కూడా వివరాలు ఇస్తానని తాను పదేపదే చెప్పినా వినకుండా అకారణంగా వాదనకు దిగి బజారు భాషలో మాట్లాడటం వల్లే తాను సమావేశం నుంచి వెళ్లిపోయాయని చెప్పారు. వెళ్లిపోయే ముందు మూడు సార్లు తన వాదనను మేయర్‌కు విన్పించినా ఆయన పట్టించుకోలేదని, సభ్యులను మేయర్ నియంత్రించకుండా తన సైగల ద్వారా రెచ్చగొట్టారని ఆరోపించారు. సభను నియంత్రించాల్సిన మేయర్

మౌనంగా ఉండటం, కొంత మంది తామే 10 లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్నామని ఆపాదించుకుని అధికారులను కించపరచి ఏకవచనంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. కౌన్సిల్‌లో చోటుచేసుకున్న అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లానని, గత నాలుగేళ్లలో నిబంధనలకు విరుద్ధంగా నిధుల వినియోగంపైనా వివరాలు సేకరిస్తున్నామని, త్వరలో ప్రభుత్వానికి నివేదిక పంపుతామని అన్నారు.

3న కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

వివరాలు వెల్లడిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు వచ్చేనెల 3వ తేదీన జరుగుతాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం నగర పాలక సంస్థలో మీడియాకు వివరాలు వెల్లడించారు. ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ నోటిఫికేషన్ ఓటర్ల జాబితాను గురువారం ప్రకటించామని, ఓటర్ల లిస్టు, నోటిఫికేషన్‌ను నగర పాలక సంస్థ నోటీసు బోర్డులో ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ నెల 22 నుండి 24వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుండి 3 గంటల వరకు జిఎంసి అదనపు కమిషనర్ ఛాంబర్‌లో నామినేషన్‌లు దాఖలు చేయవచ్చని అన్నారు. అందిన నామినేషన్లను 24న ప్రకటిస్తామని, 27వ తేదీ ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు నామినేషన్ల పరిశీలన, ఆమోదం పొందిన వాటి ప్రకటన ఉంటుందని, 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని, అనంతరం తుది పోటీలోని అభ్యర్థులను ప్రకటిస్తామని వివరించారు. 3న ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నిక, అనంతరం ఓట్ల లెక్కించి ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సి.హెచ్ శ్రీనివాసరావు, కౌన్సిల్ సెక్రటరీ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జనవరి 26న గణతంత్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజతో కలసి అధికారులతో ప్రాథమిక సమావేశాన్ని కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవాల్లో ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై శకటాలు రూపొందించి పరేడ్‌లో ప్రదర్శించాలని, స్టాళ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. వ్యవసాయం, హార్టికల్చర్, విద్య, వైద్యశాఖ, గృహ నిర్మాణం, ఆర్‌డబ్ల్యూఎస్, డీఆర్డీఏ, మెప్మా, పంచాయతీరాజ్, సివిల్ సప్లయీస్, జియంసీ,

▶ 2లో

పీజీ పరీక్షల తేదీల్లో మార్పులు

1, 3 సెమిస్టర్ పరీక్షలకు మారిన షెడ్యూల్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని పీజీ, ప్రొఫెషనల్ కోర్సులకు నిర్వహించే పరీక్షల తేదీల్లో మార్పులు చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు గురువారం తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఆర్ట్స్ కోర్సులు, సైన్స్, ఎంబీఏ, ఎంసిఏ, యంఇడి కోర్సులకు మూడవ సెమిస్టర్ పరీక్షలు నిర్వహణ తేదీలు ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభమవ్వాల్సిన పరీక్షలు ఫిబ్రవరి 11వ తేదీ నుంచి జరుగుతాయని వెల్లడించారు. ఈనెల 27వ తేదీ నుంచి జరగాల్సిన 1వ సెమిస్టర్ ఆర్ట్స్, సైన్స్, ఎంబీఏ, ఎంసిఏ, యంఇ డి పరీక్షలు ఫిబ్రవరి 13వ తేదీ నుంచి నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ పరీక్షలు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతాయని తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ తేదీల్లో యూజీసీ నెట్ పరీక్ష ఉండటంతో వీసీ కె.గంగాధరరావు ఆదేశాల మేరకు మూడో సెమిస్టర్ పరీక్షల తేదీల్లో మార్పులు చేశామని, మూడో సెమిస్టర్ పరీక్షలు రాసే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఈ సమాచారాన్ని ఆయా కళాశాలలకు కూడా పంపుతున్నామని, యూనివర్సిటీ వెబ్సైట్‌లో పొందుపరిచామని తెలిపారు.

నేటి నుంచి ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో మస్తాన్ దర్గా వద్ద ఉరుసు ఉత్సవాల సందర్భంగా శుక్రవారం నుంచి ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు డిఎస్‌పి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 21వ తేదీ వరకు ఈ మార్పులు ఉంటాయని పేర్కొన్నారు. చుట్టగుంట వైపు నుంచి వచ్చే వాహనాలను ఐటిసి కంపెనీ మీదుగా నగరంపాలెం ద్వారా హిందూ కళాశాల మార్కెట్ వైపు వెళ్లాలని కోరారు. చుట్టుగుంట వైపు నుండి ట్రావెలర్సు బంగ్లాకు వచ్చే ఆటోలు, ద్విచక్ర వాహనాలు చెక్కల బజారు, మూడు బొమ్మల సెంటర్ మీదుగా వెళ్లాలని సూచించారు. గుంటూరు నగరంలో నుండి చుట్టుగుంట వైపు వెళ్ల వాహనాలు యథావిధిగా వెళ్ళవచ్చని, జిటి రోడ్డులో వన్‌వే ట్రాఫిక్ అమలు అవుతుందని పేర్కొన్నారు.

షేక్ అస్మతున్నీసా

ఆళ్ల నాగేశ్వరరావు

రంగిశెట్టి రమేష్

పాతూరి సుబ్రహ్మణ్యం

నలుగురికి తెలుగు కీర్తి జాతీయ పురస్కారాలు

ప్రజాశక్తి - తెనాలి

అంతర్జాతీయ గుర్తింపు పొందిన సాహితీ సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో అందించే తెలుగు కీర్తి జాతీయ పురస్కారాలకు తెనాలి ప్రాంతానికి చెందిన సాహితీప్రియులు నలుగురు ఎంపికయ్యారు. వీరికి ఈనెల 21న విజయవాడలో నిర్వహించే సాహితి సభలో పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు నిర్వాహక సంస్థ నుంచి గురువారం సమాచారం అందుకున్నారు. పురస్కారాలకు ఎంపికైన వారిలో ప్రముఖ కవయిత్రి డాక్టర్ షేక్ అస్మతున్నిసా, ప్రముఖ కవి ఆళ్ల నాగేశ్వరరావు, రంగిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రంగిశెట్టి రమేష్, ప్రముఖ పద్య కవి డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్యం ఉన్నారు. సాహితీ రంగంలో వారందించిన సేవలకు గుర్తింపుగా పురస్కారాలను అందిస్తున్నట్లు నిర్వాహక సంస్థ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ పేర్కొన్నారు.

కౌన్సిలా? క్యాన్సిలా?

(మొదటి పేజీ తరువాయి)

వ్యాప్తంగా ఉన్న మేయర్లు, మునిసిపల్ చైర్మన్లతో త్వరలో గుంటూరులో భారీ సభ నిర్వహించాలని తలపెట్టారు. మేయర్, కార్పొరేటర్ల పట్ల అధికారుల వ్యవహారశైలిని తప్పుపడుతూ ఈ అంశంపై స్థానిక సంస్థల ప్రతినిధులతో రాష్ట్ర స్థాయి ఉద్యమం చేయాలని కూడా ఆలోచన చేస్తున్నారు. తక్షణం కమిషనర్ దిగిరాక పోతే రాజ్యాంగపరమైన అవకాశాలు మేరకు కమిషనర్ న్యాయపరంగా వెళ్లాలని వైసిపి నాయకులు యోచిస్తున్నారు. ఈ విషయంపై త్వరలో వైసిపి అధినేత జగన్‌తో మాట్లాడి రాష్ట్ర స్థాయి పోరాటం చేయాలని గురువారం జరిగిన సమావేశంలో వైసిపి ముఖ్య నాయకులు నిర్ణయించారు. ఇదిలా ఉండగా శుక్రవారం సమావేశం నేపథ్యంలో కమిషనర్ వ్యూహాత్మకంగా ఆరునెలలుగా పెండింగ్‌లో ఉన్న స్టాండింగ్ కమిటీల సభ్యుల ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అయిన తరువాత కౌన్సిల్ సమావేశం నిర్వహించరాదని అధికారులు చెబుతున్నారు. దీంతో శుక్రవారం జరిగే సమావేశం ఎలా నిర్వహిస్తారన్న అంశం చర్చనీయాంశంగా మారింది.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ట్రాన్స్‌కో, ఐసిడిఎస్, అగ్నిమాపక శాఖల అధికారులు శకటాలను ఆకర్షణీయంగా రూపొందించాలని చెప్పారు. మైక్రో ఇరిగేషన్, పశుసంవర్ధక శాఖ, హ్యాండ్‌లూమ్స్, సోషల్‌వెల్ఫేర్, అన్ని వెల్ఫేర్ శాఖలు, డిజేబుల్ వెల్ఫేర్, మత్స్యశాఖ, డ్వామా, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన శాఖధికారులు స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. దేశభక్తిని ప్రతిబింబించే విధంగా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు డిఈఓ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం ప్రారంభం నుండి ముగిసే వరకూ విద్యుచ్ఛక్తి అంతరాయం లేకుండా ఆ శాఖాధికార్లు చర్యలు తీసుకోవాలన్నారు. పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థులు, స్వాతంత్ర్య సమరయోధులు, జిల్లా ప్రముఖులు, అధికారులు, మీడియా, ప్రజలకు అవసరమైన గ్యాలరీల ఏర్పాట్లను చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పరిశుభ్రతతోపాటు పోలీస్ కవాతు ఏర్పాట్లపై పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. పరేడ్‌లో కార్యక్రమాలకు ఇన్‌ఛార్జిగా గుంటూరు ఆర్డీవో, గుంటూరు పశ్చిమ తహశీల్దార్ పర్యవేక్షించాల్సి ఉంటుందని, పాల్గొనే వారందరికీ తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తమ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులకు మెరిట్ సర్టిఫికెట్‌ను అందించేందుకు సంబంధించి వివరాలను కలక్టరేట్‌కు సోమవారం సాయంత్రంలోపు అందించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ షేక్ ఖజావలి, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, ఆర్‌డిఓ శ్రీనివాసరావు, జెడ్పీ సిఇఓ జ్యోతిబసు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోజుకు ఇద్దరికైనా కుక్కకాటు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కస్తూరిబాయి ప్రధాన రహదారిలో వాహనదార్లను నిలువరిస్తున్న కుక్కలు.. కుక్కకాటుకు గురైన బాలునికి ఇంజెక్షన్ చేస్తున్న వైద్యులు

రాగన్నపాలెం, సుభాని నగర్, సంజీవనగర్, నెహ్రూ నగర్ తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రమైంది. గతంలో వీధిలో ఒకటి రెండు కుక్కలుగా విడివిడిగా ఉండేవి. ప్రస్తుతం పదుల సంఖ్యలో గుంపులు గుంపులుగా తిరుగుతూ అటుగా వచ్చిపోయేవారిపై దాడులకు దిగుతుగున్నాయి. పిల్లలు, వృద్ధులు, వాహన చోదకులు, మేకలు, గొర్రెలు, పశువులు, దూడలపైకి మూకుమ్మడిగా వస్తున్నాయి. కస్తూరిబాయి లాంటి ప్రధాన రహదారులపై గుంపులు గుంపులుగా చేరి కార్లు, మోటార్ సైకిల్‌పై వెళ్లే వారిపై దాడులు చేస్తుండగా అనేకసార్లు వాహన చోదకులు పడిపోయి తీవ్రగాయాలైన సంఘటనలున్నాయి. పట్టణంలో చార్లెస్ కాన్వెంట్ ప్రాంతంలో చిన్న పిల్లలపై కుక్కలు దాడులు అధికమవడంతో పిహెచ్‌సికి కనీసం రోజుకు ఇద్దరైనా బాధితులు నమోదువుతున్నాయని పిహెచ్‌సి సిబ్బంది చెబుతున్నారు. మండల స్థాయిలో ఉన్న 5 పిహెచ్‌సిలలో రోజు మార్చి రోజైన ఇద్దరు ముగ్గురైనా కుక్కకాటు బాధితులు వస్తున్నారని తెలిసింది.

పట్టణములో 38 వార్డులున్నాయి. ఒకొక్క వార్డుకి మూడు విధులన్నాయి. ఒకొక్క వీధికి 3 నుంచి 5 కుక్కలున్నాయి. పట్టణంలో వీటి సంఖ్య సుమారుగా 600కుపైగా ఉండొచ్చని, మండలంలోని 23 గ్రామాల్లో వెయ్యికిపైగానే ఉండొచ్చని అంచనా. సంతాన సీజన్ ఒక్కటి వస్తే ఒకొక్క కుక్క 8/13 పిల్లలను పెట్టే అవకాశం ఉంది. కుక్కలకు సంతాన నియంత్రణ చర్యలు చేపట్టకున్నా, ఇప్పుడు వాటిని అదుపు చేయకున్నా కుక్కకాటు బాధితులు మరింతగా పెరుగుతారని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

గతంలోనే ప్రతిపాదనలు

డాక్టర్ దీప్తి, పశువైద్యులు

కుక్కలు కరిచినంత మాత్రాన కంగారు పడకుండా, పంటి ఘాటు తీవ్రత ఏ స్థాయిలో ఉందో పరిశీలించుకోవాలి. కుక్క వైరస్‌తో కూడిన ఉమ్ము శరీరంలోకి వెళ్లిందా లేదా అనేది చూడాలి. కుక్క లక్షణాలు పరిశీలించాలని, కరిచిన కుక్క తర్వాత కాలంలో ఎలా ప్రవర్తిస్తుందో గమనిస్తూ ఉండాలి. కరిచిన వెంటనే సరైన వైద్యం చేయించుకోవాలి. కుక్కలకు సంతాన నియంత్రణ చేయాలంటే ఒక్కో కుక్కకు రూ.వెయ్యి వరకు ఖర్చవుతుంది. ఇంజెక్షన్ చేసిన వెంటనే దానిని పర్యవేక్షించాల్సి ఉంటుంది. దీనిపై మున్సిపాల్టీకి గతంలోనే అంచనాలు నివేదించాం. ప్రస్తుతం ఆపరేషన్ చేసేందుకు అనువైన ల్యాబ్ లేదు. అన్ని సౌకర్యాలతో కూడిన ల్యాబ్ నిర్మించాలంటే సుమారుగా రూ.5 లక్షల వరకు అవుతుంది. త్వరలో ఏర్పాటు చేసేలా కృషి చేస్తాం.

క్రమంగా విస్తరిస్తున్న ఆయిల్ పామ్ సాగు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతుంది. ప్రభుత్వం ఉచితంగా మొక్కలు, రాయితీపై డ్రిప్ పరికరాలు అందించడం ఏటా సాగు ఖర్చులకు సహాయం అందిస్తుండడంతో పాటు తక్కువ పెట్టుబడితో పంట చేతికి రావడం, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే స్వభావం కలిగిన ఆయిల్ పామ్ సాగుపై రైతులు మొగ్గ చూపుతున్నారు. ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు. రైతులకు అవగాహన కల్పిస్తూ సాగు సంబంధిత సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

పల్నాడు జిల్లాలో మూడేళ్ల క్రితం 20 ఎకరాల తో ప్రార ప్రారంభమైన ఆయిల్ పామ్ సాగు ప్రస్తుతం 294.76 హెక్టార్లకు (హెక్టారు – రెండున్నర ఎకరాలు) విస్తరించింది. ప్రధానంగా అమరావతి మండలం ధరణికోట, జూపూడి, బెల్లంకొండ మండలం మన్నే సుల్తాన్ పాలెం, ఈపూరు మండలం ఇనుమెల్ల, బొమ్మరాజుపాలెం, మాచవరం మండలం పిల్లుట్ల, ఆకురాజుపల్లి, నాదెండ్ల మండలం, నాదెండ్ల, గణపవరం, రాజుపాలెం మండలం, బీరవల్లిపాయ, చాగల్లు, సత్తెనపల్లి మండలం పాకలపాడు, ధూళిపాళ్ల గ్రామలలో సాగు చేస్తున్నారు. ఎకరా విస్తీర్ణానికి 57 మొక్కలు చొప్పున ఒక రైతుకు గరిష్టంగా 37 ఎకరాల పరిమితి వరకు ఉద్యాన శాఖ ఉచితంగా మొక్కలు అందిస్తుంది. అదేవిధంగా డ్రిప్ పరికరాలను 90 శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తుంది. మొక్కల పెంపకానికి మొదటి 4 ఏళ్ళ పాటు ఏడాదికి ఎకరానికి రూ.5250 చొప్పున అందిస్తున్నారు. మొక్కలు నాటిన 4 ఏళ్ల తర్వాత పంట దిగుబడి వస్తుంది. ఎకరానికి 8 టన్నుల వరకు దిగుబడి వస్తుందని రూ 80 వేల వరకూ ఆదాయం పొందవచ్చని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. మొక్కలు నాటిన తర్వాత పంట కోతకు రావడానికి పట్టే 4 ఏళ్ల కాలంలో రైతులు అంతర పంటలుగా పొగాకు, అరటి, మొక్కజొన్న, ఆకుకూరలు, కూరగాయలు, మిరప, అపరాలను సాగు చేపట్టడం ద్వారా అదనపు ఆదాయం పొందడంతో పాటు ప్రధాన పంట ఆయిల్ పామ్ కు ప్రత్యేకంగా సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన పనిలేదని ఉద్యాన శాఖ అధికారులు అంటున్నారు.

ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటలు సాగు చేసేటప్పుడు ఆయిల్ పామ్ ఆకుల విస్తరించి ఉన్న ప్రదేశాన్ని వదిలేసి మిగతా ప్రదేశాల్లో అంతర పంట వేసుకోవాల చెప్పారు. అంతర పంట సాగు చేసేటప్పుడు ఆయిల్ పామ్ ఆకులను నరికేయడం, తాళ్లతో కట్టడం చేయకూడదన్నారు. ఆకులను ఏపుగా పెరిగే విధంగా చూడాలని, చెట్టుపై ఎప్పుడు 30 నుండి 35 ఆకులు ఉండేటట్టు చూసుకోవాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే మంచి దిగుబడి పొందే అవకాశం ఉందని చెబుతున్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఉద్యాన శాఖ అధికారి సిహెచ్ రమణారెడ్డి

ఆయిల్ పామ్ సాగుకు చౌడ భూములు మినహా నీటి వసతి కలిగిన అన్ని రకాల నేలలు అనువుగా ఉంటాయి. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను, ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఉచితంగా ఆయిల్ పామ్ మొక్కలు ఉచితంగా ఇవ్వడంతో పాటు 4 ఏళ్ల పాటు వాటి పెంపకానికి ఎకరానికి రూ.5250 రాయితీపై డ్రిప్ పరికరాలను ఇస్తున్నాం. రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించడంతో పాటు సలహాలు, సూచనలు అందిస్తున్నాం. ఆయిల్ పామ్ అంతర పంటలుగా అంతర పంటలుగా పొగాకు, మిరప, పండ్ల తోటలు, పూల తోటలు, కూరగాయ పంటల సాగు చేయొచ్చు. దీర్ఘకాలిక దిగుబడులు, రైతులకు లాభాలు వచ్చే ఆయిల్ పామ్ తోటల వైపు రైతులు మొగ్గ చూపేలా సలహాలు సూచనలు చేస్తున్నాం. ఆయిల్ పామ్ సాగు చేయదలిచిన రైతులు మరిన్ని వివరాలకు ఆయా గ్రామాల పరిధిలోని ఉద్యాన శాఖ అధికారులను లేదా 7995086775, 63038 32059 నందు సంప్రదించండి.

యానాది కాలనీని ఆధునికంగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్థానికులతో అర్నాల్డ్, ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట మండలం కోటప్పకొండలోని యానాది కాలనీని మోడ్రన్ కాలనీ తీర్చిదిద్దుతానని మహర్షి ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రతినిధి డాక్టర్ ఆర్నాల్డ్ అన్నారు. గురువారం డాక్టర్ ఆర్నాల్డ్ నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి కోటప్పకొండలోని యానాది కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు మానసికంగా, శారీరకంగా బలంగా ఉంటూ వారి కాళ్లపై వాళ్ల నిలబడేలా చేయాలన్న లక్ష్యంతో తాము పని చేస్తున్నామని చెప్పారు. వారికి సంపూర్ణ ఆరోగ్యం సమకూరేలా మంచి ఆహారాన్ని అందించడమే తమ లక్ష్యమన్నారు. వారి కాళ్లపై వాళ్ల నిలబడేలా ఒక చిన్న దుకాణాన్ని ఏర్పాటు చేసుకొని జీవనం సాగించేలా తోడ్పాటునందిస్తామని చెప్పారు. తనకు వైదిక విజ్ఞాన సంప్రదాయం అంటే చాలా ఇష్టమని, తాను 50 ఏళ్లగా వేద శాస్త్రం గురించి మహర్షి మహేయోగి బోధనలను అనుసరిస్తున్నానని చెప్పారు. ప్రజలందరికీ మెరుగైన జీవన విధానం కోసం ఈ సంఘాల అభివృద్ధికి మద్దతివ్వడం ద్వారా భారతదేశానికి సేవ చేయగలనని తాను ఆశిస్తున్నానని తెలిపారు. ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ మనిషి మానసిక పరివర్తనకు ధ్యానం దోహదపడుతుందన్నారు. కాలనీలో మౌలిక మౌలిక వసతులు కల్పించేందుకు, సుమారు 300 ఇళ్లు కట్టేందుకు వారు ముందుకు వచ్చారని తెలిపారు.

టెక్స్‌టైల్స్ మిల్లులను ఆదుకోవాలి

మీడియా సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు కోటిరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో సంక్షోభంలో ఉన్న స్పిన్నింగ్, జిన్నింగ్ మిల్లుల వారిని అదుకోవాలని రాష్ట్ర టెక్స్‌టైల్స్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.కోటిరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టెక్స్‌టైల్స్ పరిశ్రమపై ఆధారపడిన వారికి మేలు చేసేందుకు తక్షణం పెండింగ్‌లోఉన్న సబ్సిడీ బకాయిలు విడుదల చేయాలన్నారు. విద్యుత్ సుంకాలు భారంగా మారాయని వీటిని తొలగించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా టెక్స్‌టైల్స్ పరిశ్రమకు యూనిట్ రూ.2చొప్పున విద్యుత్ రాయితీ ఇవ్వాలన్నారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో విద్యుత్ రంగంలో జరిగిన అనుబంధ విధానాలను సమీక్షించి పెంచిన విద్యుత్ ఛార్జీల నుంచి టెక్స్‌టైల్ పరిశ్రమకు మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈ అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సానుకూల స్పందన రాలేదన్నారు. గుజరాత్, మహారాష్ట్ర, బీహార్, ఒడిషా తదితర రాష్ట్రాల్లో ఉన్న విద్యుత్ విధానాలు, సబ్సిడీలను అమలు చేయాలన్నారు. ఇందువల్ల స్పిన్నింగ్ పరిశ్రమ నిలదొక్కుకుంటుందన్నారు. స్పిన్నింగ్ పరిశ్రమ వల్ల రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, ఆర్థిక వృద్ధికి వెన్నుముకగా నిలుస్తుందన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించిన టెక్స్‌టైల్ పరిశ్రమను కాపాడటానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు ఎల్.రఘురామిరెడ్డి, సామినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ హెవీ మోటార్ డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

మాట్లాడుతున్న జిల్లా ప్రజారవాణా అధికారి రవికాంత్, తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు పార్ల మెంట్ పరిధిలోని ఆర్టీసి హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ స్కూల్, గుంటూరులో 18వ బ్యాచ్ శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా ప్రజారవాణా అధికారి యం.రవికాంత్ పాల్గొని మాట్లాడుతూ ఆర్టీసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 25 సంవత్సరాల అనుభవం కలిగిన ఎస్‌డిఐల ద్వారా నాణ్యమైన శిక్షణను అందిస్తున్నామని, శిక్షణ పొందే అభ్యర్థులు రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించాలని, డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడకూడదని, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలన్నారు. శిక్షణ ఇచ్చే వారి సూచనలు పాటిస్తూ ఇంధనం పొదుపు చేసే డ్రైవింగ్ పద్ధతులు అలవర్చుకొని తదనుగుణంగా ఇంధనం పొదుపు చేసి అధికారుల ప్రశంసలు పొందాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు అనేక విధాలుగా ఉద్యోగావకాశాలు ఉన్నాయని, డ్రైవింగ్ తరగతులకు ప్రతిరోజు హాజరై రోడ్డు భద్రత నియమాలను నేర్చుకొని, డ్రైవింగ్ చేసే సమయంలో సమయస్పూర్తిగా వ్యవహరిస్తూ ప్రమాద రహిత డ్రైవింగ్ చేయాలని సూచించారు. హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ స్కూల్, గుంటూరు ప్రిన్సిపల్ యస్.కె.అబ్దుల్ సలామ్ మాట్లాడుతూ ఆర్టీసి హెవీమోటార్ వెహికిల్ డ్రైవింగ్ స్కూల్ నందు శిక్షణ పొందడం హర్షించ్ తగిన విష యం అన్నారు. ప్రతిరోజు ఒక గంట వాహనం యొక్క వివిధ భాగాల గురించి వాటి పనితీరు గురించి, వివిధ రకాల రోడ్ల గురించి, రోడ్లపైన ఉండే రోడ్డు సిగ్నల్ సూచీకల మార్క్‌ల గురించి, రోడ్లకు సంబంధించిన సిగ్నల్ బోర్డుల ప్రాధాన్యత గురించి వివరిస్తామన్నారు. ఎదురుగా వచ్చే వాహనాలను గమనిస్తూ ఎటువంటి ప్రమాదములు జరగకుండా చూసుకోవాలని పలు సూచనలు చేశారు. ఘాట్ రోడ్డులో ఎటువంటి భయం లేకుండా నడపటానికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. హెవీ డ్రైవింగ్ శిక్షణ పొందిన వారికి 108 వాహనములలో, ఆర్టీసిలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా, హైర్ బస్ డ్రైవర్లుగా అవకాశాలు ఉంటాయని తెలియజేశారు.

సాంకేతిక లోపంతో రోడ్డు రోలర్ దగ్ధం

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని పేరుకలపూడి పెదపాలెం గ్రామాల మధ్య రోడ్డు పునర్ నిర్మాణ పనుల నిమిత్తం వచ్చిన రోడ్డు రోలర్ గురువారం అగ్నికి ఆహుతయ్యింది. ఈ ప్రమాదంలో రోలర్ ఇంజన్ భాగం పూర్తిగా దగ్ధమైందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఇంజన్‌లో వచ్చిన సాంకేతిక లోపం వలన మంటలు చెలరేగంతో డ్రైవర్ అప్రమత్తమై అత్యవసర మైన కేబుల్ తీసుకొని క్రిందికి దిగిపోయాడు. ఆర్పేందుకు పరిసర ప్రాంతాల్లో నీటి సదుపాయం లేకపోవడంతో తెనాలి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాడు. సింగల్ డ్రం రోడ్డు రోలర్ అని పిలవబడే ఈ వాహనం ఖరీదు రూ.30 లక్షలని దాదాపు రూ. 9 లక్షల 50 వేల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఈ రోలర్ ఫిరంగిపురం మండలం మెరికపూడి గ్రామానికి చెందిన జంగాల రూతమ్మ అనే మహిళకు చెందినదని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - తాడికొండ

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు చేసిన ఘటన తాడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్.ఐ ఎం జోజి వివరాల ప్రకారం మోతడక గ్రామానికి చెందిన పల్లపాటి రాజేష్ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మధ్యవర్తిగా పనిచేసుకుంటూ ఉంటాడు. ఈ నేపథ్యంలో నిడుముక్కల గ్రామానికి చెందిన వడ్లమూడి సాంబశివరావు భూమిని చెన్నై ప్రాంతానికి చెందిన వ్యక్తికి రూ. కోటి పది లక్షలకు అమ్మారు. ఈ సందర్భంగా రాజేష్‌కు కమిషన్ కింద రూ. 10 లక్షలు రావలసి ఉండగా సాంబశివరావు రాజేష్ కు రెండు లక్షలు ఇచ్చి చేతులు దులుపుకున్నాడు. మిగిలిన ఎనిమిది లక్షలను అడుగగా సాంబశివరావు కాలయాపన చేస్తున్నాడు. గట్టిగా డబ్బులు అడగటంతో రాజేష్‌ను కులం పేరుతో దూషించి సాంబశిరావు దాడికి తెగబడ్డాడు. రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వడ్లమూడి సాంబశివరావు పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై జోజి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి -మేడికొండూరు

రోడ్డుపై వేగంగా వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఆటో బలంగా ఢీకొనడంతో ద్విచక్ర వాహనం ప్రయాణిస్తున్న వ్యక్తి మృతిచెందగా మరో వ్యక్తి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండలంలోని సత్తెనపల్లి రోడ్డులోని గుళ్ళపాలెం అడ్డరోడ్డు వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగింది. కొర్రపాడు గ్రామానికి చెందిన పెరుగు నాగ వెంకట అనంత మోహన కుమార్, గోపి నీలం సుదర్శన్ ఇరువురు ద్విచక్ర వాహనంపై కొర్రపాడు నుంచి గుంటూరుకు బయలుదేరారు. మార్గమధ్యలో గుళ్ళపాలెం అడ్డ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో బలంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న పెరుగు నాగ వెంకట అనంత మోహన్ కుమార్(23) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరో వ్యక్తి నీలం గోపి సుదర్శన్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఆటో డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాద సంఘటన విషయం తెలుసుకున్న మేడికొండూరు పోలీసులు ప్రమాద సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన నీలం గోపి సుదర్శన్‌ను మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సేకరించిన వివరాల ప్రకారం ముత్తెంశెట్టిపాలెం నుంచి ఇస్లాంపేట వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెంది ఉండటాన్ని గురువారం స్థానికులు గుర్తించారు. పోలీసులు వివరాల ప్రకారం తమిళ నాడుకి చెందిన మణి అనే వ్యక్తితో 50 ఏళ్ల మహిళ కొంత కాలంగా సహజీవనం చేస్తుంది. మణి క్రేన్ పాయింట్‌లో పని చేస్తుండగా, ఆమె బిక్షాటన చేసు కుంటుంది. అయితే బుధవారం రాత్రి రోడ్డు పక్కన నిద్రించిన మహిళ తెల్లవారేసరికి మృతి చెంది ఉంది. రాత్రి వేళ ఇరువురు కలిసి కలిసి మద్యం సేవించి గొడవ పడినట్లు స్థానికులు చెబుతున్నారు. మహిళ తీవ్ర రక్తస్రావానికి గురైనట్లు తెలుస్తోంది. అనుమానితుడిని పట్టణ వన్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని, మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

యువకుడిపై హత్యాయత్నం

ప్రజాశక్తి - తెనాలి : పట్టపగలు యువకుడి పై హత్యాయత్నం జరిగింది. స్థానికులు వెల్లడించిన వివరాల ప్రకారం పట్టణంలో వెండి పని చేసుకునే తేలప్రోలు గ్రామానికి చెందిన షేక్ సుభానీపై గురువారం ఉదయం నడిరోడ్డుపై ఇరువురు యువకులు కత్తితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన సుభానీని స్థానికులు తెనాలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. సుభానీ తన సోదరుడు బాజితో కలిసి ఓ ఫంక్షన్‌కు మిత్రులను పిలిచేందుకని తెనాలి వచ్చాడు. గాంధీచౌక్ నుండి కొత్తపేట వెళ్లే దారిలో రోడ్డు పక్కన నిలబడి ఉండగా తేలప్రోలుకు చెందిన అరాఫత్, ఇర్ఫాన్ అనే ఇద్దరు యువకులు వచ్చి సుభానీపై కత్తితో దాడిచేసినట్లు అతని సోదరుడు చెబుతున్నాడు. క్షతగాత్రుడిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అరాఫత్ గత ఏడు నెలలుగా తరచూ ఘర్షణకు దిగుతున్నాడని, రెక్కీ నిర్వహించి మరీ కత్తులతో తిరుగుతు న్నారని బాధితుడి సోదరుడు వెల్లడించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

రైల్లో ప్రయాణికుడు మృతి

ప్రజాశక్తి - తెనాలి : రైల్లో ప్రయా ణికుడు మృతి చెందాడు. తెనాలి రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గూడూరు - విజయవాడ రైలులో గురువారం ప్రయాణికుడు మృతి చెందాడన్న సమాచారంతో రైల్వే పోలీసులు అప్రమత్త మయ్యారు. రైలు తెనాలి స్టేషన్‌కు చేరుకోగానే మృతదేహాన్ని రైలు నుండి దింపించారు. మృతుడి వయసు 45 నుండి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించి,. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వెంకటాద్రి తెలిపారు.

దేహదారుఢ్య పరీక్షల్లో 238 మందికి అర్హత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సంక్రాంతి శెలవుల విరామం అనంతరం గురువారం తిరిగి పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు కొనసాగాయి. స్థానిక పోలీసు పేరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన ఈ పరీక్షలకు 383 మంది హాజరు కాగా వారిలో 77 మంది సంబంధిత ధ్రువ పత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. మిగిలిన 306 మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు నిర్వహించగా వారిలో 23 మంది అనర్హులయ్యారు. మిగిలిన 283 మందికి 1600 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా 41 మంది అనర్హులు కాగా 242 మంది తదుపరి పరీక్షల కొరకు అర్హత సాధించారు. వీరిలో 242 మందికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. ఒకరు మధ్యలో నిష్క్రమించారు. 95 మంది అనర్హులుగా నిర్ధారించారు. 242 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా వారిలో 236 మంది అర్హత సాధించారు. మొత్తం అన్ని పరీక్షల్లో 306 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 238 మంది అర్హత సాధించగా, 68 మంది అనర్హతకు గురయ్యారు. కానిస్టేబుల్ దేహ దారుఢ్య పరీక్షల నిర్వహణ తీరును ఎస్‌పి సతీష్‌కుమార్, అదనపు ఎస్‌పిలు సుప్రజ, రమణమూర్తి పరిశీలించారు.

రాయపూడిలో ఫాగింగ్ చేస్తున్న పంచాయతి కార్మికులు

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - తుళ్లూరు

మండల పరిధిలోని రాయపూడి గ్రామంలో గురువారం దోమల నివారణకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. యంత్రాలతో గ్రామంలో ఫాగింగ్ చేయించారు. కాల్వల్లో పిచికారీ చేశారు. దోమ కాటు వల్ల మలేరియా, డెంగీ లాంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉన్నందున పొగ యంత్రాలతో దోమల నివారణకు చర్యలు చేపట్టామని పంచాయతీ కార్యదర్శి మల్లిఖార్జునరావు తెలిపారు.

వంట పాత్రల పంపిణీలో తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ

రెడ్‌క్రాస్ సొసైటీ వితరణ

ప్రజాశక్తి తెనాలి

అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వంటి పాత్రలు పంపిణీ చేశారు. స్థానిక వైకుంఠపురం లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులకు తహశీల్దార్ కె వి గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని రెడ్ క్రాస్ సంస్థ ఏర్పాటు చేసిన వంట పాత్రలను బాధితులకు అందించారు. బాధితులను ఆదుకోవడంలో రెడ్ క్రాస్ చొరవను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ట్రెజరర్ నాళం శ్రీమన్నారాయణ మూర్తి, స్థానికులు పాల్గొన్నారు

బాధితుల నుండి వివరాలు సేకరిస్తున్న ఆర్‌డిఒ

వివాదాస్పద స్థలంపై ఆర్‌డిఒ పరిశీలన

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణ శివారు ప్రాంతంలోని మేరిమాత విగ్రహం వద్ద గల వివాదస్పద స్థలాన్ని గురజాల ఆర్డీవో మురళీకృష్ణ గురువారం పరిశీలించారు. భాదితుడు కొమ్ము ఆనందరావుతో మాట్లాడి ఘటన గురించి వివరాలు సేకరించారు. సోమవారం రాత్రి సమయంలో కొందరు వ్యక్తులు తనపై దాడి చేసి తన ఇంటిని, వ్యాపార సముదాయాలను అర్ధరాత్రి కూల్చివేశారని భాదితులు తెలిపారు. నిలువ నీడ లేకుండా పోయిందని, కుటుంబ మెత్తం రోడ్డున పడ్డామని, తినడానికి తిండి లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కష్టపడి నిర్మించుకున్న ఇల్లును రాత్రికి రాత్రే కూల్చివేశారని, సుమారుగా రూ.25 లక్షల ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. ఆర్‌డిఒ మాట్లాడుతూ వివాదస్పదంగా ఉన్న ఈ స్థలంపై ఇరు పక్షాల వద్దఉన్న ఆధారాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. నష్ట పోయిన వారికి న్యాయం చేస్తామన్నారు. ఆనందరావు కుటంబ పోషణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిర్మాణాలు కూల్చిన వారిపై కేసు నమోదైనట్లు అధికారులు తెలిపారు. పరిశీలనలో తహశీల్దార్ మధుబాబు, సిఐ వెంకట్రావ్ తదితరులున్నారు.

ఉద్యోగం కావాల్సిన వారు టిడిపి కార్యాలయంలో రెజ్యూమ్ ఇవ్వండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మాచర్ల

ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ యువత రాణించాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మెప్మా ద్వారా రుణం పొంది రాణిస్తున్న రిలాక్స్ ఫ్యాన్సీ జనరల్ స్టోర్స్, మనీ ట్రాన్సఫర్ షాపును పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయం ప్రాంతంలో ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సర్వీస్ ప్రొవైడర్ మేళాలో మాట్లాడుతూ అవకాశాలు మన దగ్గరికి రావని, అవకాశాలున్న చోటుకెళ్లి ఉపాధి సాధించాలని చెప్పారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారని, వారిపై ఆధారపడకుండా సొంత కాళ్లపై నిలబడాలని సూచించారు. వివిధ వృత్తుల్లో వస్తున్న సాంకేతికత పరిజ్ఞానం, పరికరాలను వినియోగించటంలో శిక్షణ పొంది నైపుణ్యాలతో ఎక్కడికి వెళ్లినా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తాయని అన్నారు. ప్రభుత్వం వివిధ రంగాల్లోని వృత్తిదారులను ప్రోత్సహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఇప్పటికే తాను తిరుపతి పరిసరాల్లోని అమరాన్, ఇతర సంస్థలతో మాట్లాడానని, ఉపాధి అవకాశాలు అవసరమైన వారు వారి అర్హతతో కూడిన ఆర్జీలను టిడిపి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అనంతరం పలు స్టాల్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పి.నరసింహరావు, కమిషనర్ డి.వేణుబాబు, టిడిపి నాయకులు వై.కేశవరెడ్డి, కె.అనిల్‌కుమార్, కె.దుర్గారావు, ఎం.చినవెంకటరామిరెడ్డి, ఎం.రాంబాబు, వీరాస్వామి, యల్లమంద, క్రిష్ణవేణి పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

రహదారి భద్రత అందరి బాధ్యత

- క్షతగాత్రులను ఆస్పత్రుల్లో చేర్చేవారికి చట్టపరంగా పూర్తి రక్షణ
- మాసోత్సవాలను ప్రారంభించిన పల్నాడు జెసి సూరజ్, ఎస్పీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రహదారి భద్రత అందరి బాధ్యతని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ దనుంజయ్ గనోరే, ఎస్పి కె.శ్రీనివాసరావు అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణాశాఖ రూపొందించిన 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు-2025 బ్రోచర్లు, వాల్‌పోస్టర్లను నరసరావుపేటలోని తమ కార్యాలయాల్లో జెసి, ఎస్పీ గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చేస్తున్న కృషిలో భాగంగా ఈ నెల గురువారం నుండి వచ్చేనెల 15 వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. వాహనం నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి క్షేత్రస్థాయిలో వివరించాలన్నారు. ప్రమాదం జరిగిన గంటలోపు క్షతగాత్రులకు సరైన వైద్యం అందించగలిగితే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. బాధితులను హాస్పిటల్లో చేర్చే వారికి చట్టం పూర్తిగా రక్షణ కల్పిస్తుందని, నూతన చట్టాల ప్రకారం బాధితులను వైద్యశాలలో చేర్పించే వారికి, వారి అనుమతి లేకుండా ఎటువంటి విచారణ చేయకూడదని తెలిపారు. క్షతగాత్రులను హాస్పిటల్‌లో చేర్చిన వారు మెడికల్ బిల్లు కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. రోడ్డు ప్రమాద బాధితుల పట్ల వైద్యశాల నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, బంధువులు, కుటుంబ సభ్యులు వచ్చేలోగా మెరుగైన చికిత్స అందించాలని చెప్పారు. జిల్లా రవాణా శాఖ అధికారి జి.సంజీవ్ కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించామని, అధిక చార్జీలు వసూలు చేసిన 38 ప్రయివేటు బస్సులపై కేసులు నమోదు చేయగా నిబంధనలకు వ్యతిరేకంగా బస్సులు నడుపుతున్నందుకు 74 కేసులు నమోదు చేశామని తెలిపారు. ద్విచక్ర వాహన దారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని, భారీ వాహనాలు, బస్సులు దూర ప్రయాణాలు నడిపేవారు వాహనంలో ఇద్దరు డ్రైవర్లు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మోటారు వాహన తనిఖీ అధికారి ఎన్.శివనాగేశ్వరరావు, సహాయ మోటార్ తనిఖీ అధికారులు ఎం.మనీషా, ఎం.ఎల్ వంశీకృష్ణ, ఎం.నాగేశ్వరావు పాల్గొన్నారు.

బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న పల్నాడు జెసి తదితరులు

ముగ్గుల పోటీల్లో విజేతలకు ఆకర్షణీయ బహుమతులు

ప్రజాశక్తి - వినుకొండ

నేటి యువతకు పండగల ఆవశ్యకతలను, మన సంస్కృతీ సంప్రదాయాల ప్రాధాన్యతలను తెలియజేయడానికి సంక్రాంతి పోటీలు ఉపకరిస్తాయని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక పద్మావతి నగర్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించగా 300 మందిపైగా మహిళలు, యువతులు పాల్గొని రకరకాల రంగవల్లులతో సృజనాత్మకత చాటుకున్నారు. న్యాయ నిర్ణేతలుగా వాసవీ క్లబ్ డైరెక్టర్ కాజ్జయం విజయలక్ష్మి, జవ్వాజి సువర్ణలక్ష్మి, చీతిరాళ్ల పద్మజవల్లి వ్యవహరించారు. విజేతలకు జీవీ ఆంజనేయులు బహుమతులు ప్రదానం చేశారు. చుక్కల ముగ్గుల విభాగంలో పూజిత ప్రథమ బహుమతి కింద ఏసీ, ఉమాదేవికి ద్వితీయ బహుమతి కింద ఎల్‌ఈడీ టీవీ, సరళకు తృతీయ బహుమతి కింద వాషింగ్ మిషన్, నాగజ్యోతి నాలుగో బహుమతి కింద గ్రైండర్, హేమలత ఐదో బహుమతి కింద స్టాండ్ ఫ్యాన్ అందుకున్నారు. గీతల ముగ్గు విభాగంలో బాలలక్ష్మి ప్రథమ బహుమతిగా ఏసీ, వై.తిరుపతమ్మ ద్వితీయ బహుమతిగా ఎల్‌ఈడి టీవీ, చైతన్య తృతీయ బహుమతిగా వాషింగ్ మిషన్, ప్రియాంక నాలుగో బహుమతిగా గ్రైండర్, శ్రీదేవి ఐదో బహుమతిగా టేబుల్ ఫ్యాన్ అందుకున్నారు. 10 మంది మహిళలకు పట్టు చీరలు, ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొన్ని సూచనలు చేశారు. ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా వెంచర్లు వేయాలని, విశాలమైన రోడ్లు, డ్రెయినేజీ, పచ్చదనం ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, జనసేన నాయకులు నాగశ్రీను రాయల్, ఎన్.శ్రీనివాసరావు, బిజెపి నాయకులు లెనిన్ కుమార్, న్యాయవాదులు రామకోటేశ్వరరావు, సైదారావు, ఎన్.శరత్, షమీమ్, కరీముల్లా పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగిసిన సంక్రాంతి పోటీలు

ప్రజాశక్తి - యడ్లపాడు

సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన యడ్లపాడులో ముత్తవరపు సురేష్‌బాబు, అరుణకుమారి ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. వందలాది మంది మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. రెండురోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, మోకు లాగుడు, లెమన్ స్పూన్, స్కిప్పింగ్, బక్కెట్ బాల్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలో ప్రథమ బహుమతి లక్ష్మి ప్రియాంక, సుకన్య, ద్వితీయ బహుమతి ఎం.పూజిత, తృతీయ బహుమతి పోపూరి రూపశ్రీ గెలుచుకున్నారు. కన్సోలేషన్ బహుమతులను వెంకట జగదీశ్వరి, రాధిక, నాగభవ్య, నాగరాజ దక్కించుకున్నారు. కుండకొట్టుడులో పి.యశస్వి, ఎం.తాన్య, పి.మనస్వి, ఎం.మీనాక్షి, కిరణ్మయి, నాగలీల, మోక్ష శ్రీ,జీవన, చరణ్, ఎం.సాయి, అనిత, కావ్యశ్రీ, దేవి బహుమతులు పొందారు. మోకు లాగుడు పోటీల్లో రజని టీమ్, భారతి టీమ్, విశ్వప్రియ టీమ్‌లు విజేతలుగా నిలిచాయి. స్కిప్పింగ్‌లో నందిత, కిరణ్ సాయి, యశస్వి,లత, కిరణ్మయి, పుష్ప లత, తులసి స్వప్న, పుష్పలత విజయం సాధించారు. లెమన్ స్పూన్‌లో జస్వంత్, వాత్సల్య, భవిష్య, శ్రీవల్లీ, తాన్య, లీలావతి గెలుపొందారు. కోలాటాలు, క్లాసికల్ అభినయం, పాటలు, పద్యాలతో కళాకారులు అలరించారు. బహుమతి ప్రదానోత్సవ సభలో ఎం.సురేష్‌బాబు, డాక్టర్ భార్గవి చౌదరి, ఎ.పృథ్వి, ఎం.రామారావు, ఎం.పెద్దబ్బాయి, ఎం.కృష్ణమూర్తి, సిహెచ్.లక్ష్మీనారాయణ, జె.శంకర్రావు పాల్గొన్నారు.

లబ్ధిదారుని వివరాల సేకరణలో వైద్యబృందం

పింఛన్లపై వైద్య బృందం పునఃపరిశీలన

ప్రజాశక్తి - వెల్దుర్తి

అనారోగ్యం కారణంగా మంచానికే పరిమితమై నెలకు రూ.15 వేలు చొప్పున పింఛను పొందుతున్న వారిలో అనర్హులను గుర్తించే పేరుతో ప్రభుత్వం చేపట్టిన రీసర్వే మండలంలో గురువారం జరిగింది. మండలంలో మొత్తం 24 మంది లబ్ధిదారులు ఉండగా వీరిలో ఒకరు మరణించారు. మిగతా 23 మందిని విచారణ బృందం పరిశీలించింది. బృందంలో డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ గోపికృష్ణ, ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీరామ్ ఉన్నారు.

రెంటచింతల మండలంలో నేడు..

ప్రజాశక్తి- రెంటచింతల

పింఛను పొందుతున్న వారిలో అనర్హులను గుర్తించే పేరుతో ప్రభుత్వం చేపట్టిన రీసర్వేకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ గోపికృష్ణ, పి.రాంబాబుతో కూడిన బృందం మండలంలో శుక్రవారం పర్యటించనుంది. తొలుత మంచికల్లు, పాల్వాయిగేటు, తుమృకోట, పసర్లపాడు, మల్లవరం, మిట్టగుడిపాడు, రెంటచింతల గ్రామాల్లో పర్యటించి 19 మంది లబ్ధిదార్లను పరిశీలించనున్నారు.

ఉత్తమ ఎస్ఐగా సమందర్ వలి

ప్రజాశక్తి - వెల్దుర్తి

పల్నాడు జిల్లాలో ఉత్తమ ఎస్సైగా వెల్దుర్తిలో పనిచేస్తున్న సమందర్‌వలి ఎంపికయ్యారు. అవార్డును ఎస్పీ కె.శ్రీనివాసరావు నుండి అందుకున్నారు. విధులతోపాటు నేర విచారణలో ప్రతిభ కనబరిచినందుకుగాను అవార్డుకు సుమందర్‌వలి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఈ అవార్డు దక్కడం గర్వంగా ఉందని, శాంతిభద్రతలను కాపాడడానికి ప్రజలు తనకు సహకరించాలని కోరారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్పీ నుండి అవార్డును అందుకుంటున్న ఎస్ఐ

నాగులపాడు దళిత కాలనీలో సమస్యల కొలువు

- సగం కుటుంబాలకు పక్కా ఇళ్లు లేవు
- శ్మశానంలో మోకాళ్లలోతు నీళ్లల్లో ఖననం చేయలేమని వేదన
- పాఠశాలకు ప్రహరీ లేదు - మరుగుదొడ్ల సమస్య
- వ్య.కా.స సర్వే బృందానికి తెలిపిన కాలనీ వాసులు

ప్రజాశక్తి - పెదనందిపాడు

మడిసి సచ్చిపోతే ఏడవాలో.. పూడ్చడానికి దారి లేక ఏడవాలో అర్థం కాని దుస్థితిలో ఉన్నామంటూ దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్రతికున్న మనిషికి గూడు సమస్య అయితే చనిపోయిన మనిషిని ఖననం చేయడం మరీ సమస్యగా ఉందని నాగులపాడు దళితులు నాయకులకు తెలిపారు. గురువారం పెదనందిపాడు మండలంలోని నాగులపాడు ఎస్‌సి కాలనీలో వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో దళితులు పలు సమస్యలను బృంద నాయకులకు తెలిపారు. కాలనీలో 400 ఎస్సీ కుటుంబాలు ఉన్నాయి. 200 కుటుంబాలకు పక్కా ఇల్లు ఉన్నాయని, 200 కుటుంబాలకు పూరి గుడిసెలు, రేకుల ఇల్లు ఉన్నట్లు తెలిపారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో సుమారుగా 100 మంది ఎస్సీ కాలనీ విద్యార్థులు చదువుకుంటున్నారు. దాదాపుగా 80 శాతం మంది కాలనీ విద్యార్థులు ఈ బడిలోనే చదువుకుంటున్నారు. బడి చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడం, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కాలనీలో మురుగునీటి పారుదల సరిగ్గా లేదని తెలిపారు. కాలనీకి తూర్పు వైపు నీళ్లు వెళ్లే మార్గం లేకపోవడంతో డ్రైనేజీ ఎక్కడికక్కడ ఆగిపోయి, వర్షం వచ్చినప్పుడు నిలబడి పోతుందని తెలిపారు. ప్రధానంగా ఎస్సీ స్మశాన వాటిక సమస్య తీవ్రంగా ఉందని సర్వే దృష్టికి తీసుకువచ్చారు. స్మశాన వాటికకు వచ్చే దారి మట్టి దారి, గుంటలతో నిండి ఉందని తెలిపారు. స్మశాన వాటికలో వర్షం పడితే ఖననం చేయడానికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, నీళ్లు మోకాళ్ల లోతు నిల్వ ఉంటున్నాయని తెలిపారు. వెంటనే స్మశాన వాటికకు మెరక తోలించి, అన్ని వైపులా ప్రహరీ గోడ నిర్మించి, ఆక్రమణలకు గురికాకుండా చూడాలన్నారు. శ్మశాన వాటికలో నీటి సౌకర్యం కల్పించాలని, నీడ కొరకు షెడ్డు వేయాలని కోరారు. ఉపాధి పథకంలో తమకు కేవలం నెల రోజులు మాత్రమే పని చూపిస్తున్నారని కాలనీ వాసులు పేర్కొన్నారు. వంద రోజులు పని కల్పించాలని కోరారు. కాలనీలో వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులే నూటికి 90 శాతం మంది ఉన్నారని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు ఇవ్వాలని కోరారు. తల్లికి వందనం పథకం అమలు చేయపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫీజు రీయంబర్స్మెంట్ అమలు కావడం లేదన్నారు. ఈ సందర్భంగా వ్యకాస నాయకులు పాశం రామారావు మాట్లాడుతూ పై సమస్యలన్నీ పరిష్కరించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వస్తామని తెలిపారు. సర్వే సందర్భంగా తమ దృష్టికి వచ్చిన సమస్యలను జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేద్దామని పేర్కొన్నారు. పాఠశాల, స్మశాన సమస్యలు తక్షణం పరిష్కరించేలా కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు, ప్రజా సంఘాల నాయకులు షేక్ మహబూబ్ సుభాని మరియు తలారి కిషోర్, మామిడి డేవిడ్, తమలపాకుల శ్రీకాంత్, కె రమేష్, టి నాగేశ్వరరావు, మామిడి చౌదరి రాజు, తమలపాకుల మాణిక్యరావు, తమలపాకుల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో శ్మశాన వాటికను పరిశీలిస్తున్న నాయకులు

సర్వే నిర్వహిస్తున్న పాశం రామారావు తదితరులు

రాజధానిలో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి, రీసెర్చ్ సెంటర్ నిర్మాణానికి అడుగులు పడనున్నాయి. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరుకు సమీపంలో ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం 15 ఎకరాల భూమిని కేటాయించింది. ఫేజ్-1లో 300 పడకలతో ఆసుపత్రి నిర్మించాలని ప్రణాళికలు రూపొందించారు. ఆసుపత్రి నిర్మాణానికి 2019 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు భూమిపూజ చేశారు. వైసిపి ప్రభుత్వంలో ఆసుపత్రి నిర్మాణం ఊసే లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, అమరావతి నిర్మాణానికి ప్రాధాన్యత నివ్వడంతో ఆసుపత్రి అంశం ముందుకొచ్చింది. ఎమ్మెల్యే, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ ఇటీవల ఆసుపత్రికి కేటాయించిన స్థలాన్ని సిఆర్‌డిఎ కమిషనర్ కాటంనేని భాస్కర్‌తో కలిసి పరిశీలించారు. ఆ ప్రాంతంలో హెచ్ టి విద్యుత్ లైన్లు అడ్డుగా ఉండడంతో వాటిని తొలగించాలని సి ఆర్‌డిఎ అధికారులను కోరారు. హెచ్ టి లైన్‌లు తొలగిస్తే ఆసుపత్రి నిర్మాణ పనులు మొదలు పెట్టేందుకు అవకాశం ఉంటుందని బాలకృష్ణ చెప్పడంతో సిఆర్‌డిఎ అధికారులు ట్రాన్స్‌కోకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రికి కేటాయించిన స్థలంలో హెచ్ టి లైన్ ల తొలగింపు పనులు కొద్దిరోజుల క్రితం మొదలయ్యాయి. పశ్చిమ బంగా కు చెందిన కొంతమంది కార్మికులు పనిలో నిమగ్నమయ్యారు. లైన్ల తొలగింపు పూర్తయిన అనంతరం ఆసుపత్రి నిర్మాణ పనులు మొదలయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

తుళ్లూరులో హెచ్‌టి విద్యుత్ లైన్ల తొలగింపు పనులు

ఉత్కంఠ భరితంగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ పోటీలు ఐదవ రోజు గురువారం ఉత్కంఠభరితంగా కొనసాగాయి. మంగళగిరి వర్సెస్ పశ్చిమగోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పశ్చిమ గోదావరి జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమగోదావరి నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి గాను 199 పరుగులు చేసింది. 200 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన మంగళగిరి జట్టు 102 పరుగులకే ఆల్ అవుట్ అయి పరాజయం పాలైంది. 47 బంతుల్లో 87 పరుగులు చేసిన రక్షణ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కైవసం చేసుకున్నారు. తూర్పుగోదావరి వర్సెస్ కృష్ణా జట్ల మధ్య మ్యాచ్ హోరాహోరీగా జరగగా మ్యాచ్ టై కావడంతో ఫలితాన్ని తేల్చేందుకు ఇరు జట్లతోనూ సూపర్ ఓవర్ వేయించారు. 3 పరుగుల తేడాతో కృష్ణాపై తూర్పుగోదావరి జట్టు విజయం సాధించింది. 33 బంతుల్లో 53 పరుగులు చేసిన జయంత్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ను సాధించారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన ఇద్దరికీ పట్టణ తెలుగు యువత అధ్యక్షులు భోగి వినోద్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కనికళ్ళ చిరంజీవి సహకారంతో ఒక్కొక్కరికీ రూ 10 వేలు చొప్పున నగదు బహుమతి అందజేశారు. ప్రీమియర్ లీగ్, సిజన్-3 పోటీలలో ప్రథమ బహుమతి కింద రూ 3 లక్షలు కొమ్మారెడ్డి కిరణ్, ద్వితీయ బహుమతి కింద రూ 2 లక్షలు కాట్రగడ్డ మధు సుధన్ రావు, తతీయ బహుమతి కింద రూ. లక్ష నగదును పల్నాటి నాగేశ్వరరావు, అమ్మిరెడ్డి సాంబశివరావు సహకారంతో బహుమతులు ప్రధానం చేయనున్నారు.

మంచికలపూడిలో ఆటల పోటీలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండల కేంద్రం దుగ్గిరాల మరియు మంచికలపూడి గ్రామాలలో డివైఎఫ్ఐ, మహిళా సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఆటల పోటీలు నిర్వహిం చారు. మ్యూజికల్ ఛైర్, రన్నింగ్, స్కిప్పింగ్ టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమం వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు సిహెచ్ శ్రీనివాసరావు దేవరపామిరెడ్డి సిహెచ్ పోతురాజు మంచి పూడి గ్రామంలో వైట్ స్టాలిన్ ఎ ప్రేమేశ్వరావు టి యామిని వై శ్రావణి వి సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

30న వర్సిటీ స్టాండిగ్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహించే స్టాండింగ్ కౌన్సిల్ టు అకడమిక్ సెనేట్ 166వ సమావేశాన్ని ఈనెల 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం గురువారం తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. వర్సిటీలోని విభాగాలు, విభాగాధిపతులు అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లు తోపాటు దూరవిద్య కేంద్రం వారు, వారి అజెండా నివేదికలను ఈనెల 20వ తేదీలోగా అకడమిక్ సెక్షన్ కు పంపాలని, ఆ తర్వాత అందిన అజెండా వివరాలను పరిగణలోకి తీసుకోవటం కుదరదన్నారు.

నగర అభివృద్ధిపై సీనియర్ సిటిజన్స్‌తో నేడు సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరాభివృద్ధిలో సీనియర్ సిటిజన్స్ భాగస్వామ్యం అవసరమని, అభివృద్ధి పనులపై తమ విలువైన అభిప్రాయాలు, సూచనలు అందిచడానికి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజధాని ప్రాంతంలో ఉన్న గుంటూరు నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, ఇందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిర్మించబోతున్న శంకర్ విలాస్ ఆర్‌ఒబి, గడ్డిపాడు ఆర్‌ఒబి పనులకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. కావున నగరంలో జరుగుతున్న, విజన్ 2047లో గుంటూరు నగరాభివృద్ధికి చేపట్టవలసిన వివిధ ప్రాజెక్టల విషయాలపై సీనియర్ సిటిజన్స్ సూచనలు చేయవచ్చన్నారు. కావున ఈ ప్రతేక సమావేశానికి సీనియర్ సిటిజెన్స్ హాజరవ్వాలని కోరారు.

పారిశుధ్య పనులు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో పారిశుధ్య పనులు ప్రణాళికాబద్ధంగా నూరుశాతం జరిగేలా ప్రజారోగ్య అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం కమిషనర్ గోరంట్ల, రెడ్డిపాలెం, ఇన్నర్ రింగ్‌రోడ్, నగరాలులోని పలు ప్రాంతాలను పరిశీలించి, ప్రజారోగ్య అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పిన్‌పాయింట్‌గా, కస్టర్ల వారీగా పారిశుధ్య పనులు జరగాలన్నారు. శానిటేషన్ కార్యదర్శులు తమ సచివాలయం పరిధిలో నూరు శాతం పారిశుధ్య పనులు జరిగేలా భాధ్యత వహించాలన్నారు. ఉదయం ఇంటింటి చెత్త సేకరణ అనంతరం మధ్యాహ్నం సమయంలో గ్యాంగ్ వర్క్ ద్వారా డ్రైన్లలో పూడికతీత, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. రోడ్ల పక్కన డెబ్రిస్ లేకుండా అవసరమైతే ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పర్యటనలో డిఈఈ రమేష్ బాబు, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

19న అవగాహన ఆధ్వర్యంలో ఆరోగ్యసభ

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేట 15/1లోని సంస్థ కార్యాలయంలో జనవరి 19న ఉదయం 11 గంటలకు షుగర్, బిపి, థైరాయిడ్ సమస్యలపై ఆరోగ్య సభ నిర్వహిస్తున్నట్లు అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్ నందిపాటి వెంకట సందీప్ పాల్గొని ప్రసంగిస్తారన్నారు. కావున ఆరోగ్యాభిలాషులు అందరూ పాల్గొనాలని కోరారు.

23న మంత్రి లోకేష్ పుట్టినరోజు వేడుకలు

మంగళగిరి పట్టణంలో లైవ్ మ్యూజిక్ షో

ప్రజాశక్తి - మంగళగిరి : ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకోని వేడుకలు నిర్వహిస్తున్నామని టిడిపి నాయకులు తెలిపారు. 23వ తేదీన సాయంత్రం 6 గంటల నుంచి మంగళగిరిలో పట్టణంలో గౌతమ్ బుద్ధ రోడ్డులోని ఎన్నారై జంక్షన్ వద్ద బెల్జియన్ వాఫిల్ స్టోర్ ఎదురుగా మియామీ కేఫ్ పక్కన ఉన్న గ్రౌండ్‌లో లైవ్ మ్యూజిక్ షో జరుగుతుందని తెలిపారు. లైవ్ మ్యూజిక్ కార్యక్రమానికి ప్రముఖ సింగర్లు హాజరుకానున్నారని, ఈవెంట్ స్పాన్సర్లగా సేల్, సక్కు, మార్కోరోస్, ఉషోదయ సంస్థలు వ్యవహరిస్తున్నారు. మ్యూజికల్ లైవ్‌ను గోపి టీవి యూ ట్యూబ్ ఛానల్, వి డిజిటల్ ప్రత్యక్ష ప్రచారం అందించనున్నారని, ఉచిత ప్రవేశం అని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సిఎం సహాయనిధి చెక్కుల అందజేత

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఆపద కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన ఆర్థిక సహాయం వివిధ వర్గాలకు అండగా నిలుస్తోందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. నియోజకవర్గంలో సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఆయన గురువారం పలువురు లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం రూ.12,16,617లను అందించినట్లు ఆయన తెలిపారు.

అంతర పంటలతో నిరంతర ఆదాయం

ప్రజాశక్తి-ఈపూరు

ప్రకృతి వ్యవసాయ సాగులో అంతర పంటలు పండించడం ద్వారా నిరంతర ఆదాయం పొందవచ్చని రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఉష అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు గ్రామంలో రైతులు భాస్కరరావు, ఏడుకొండలు ప్రకృతి వ్యవసాయ సాగులో వేసిన అంతర పంటలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంది పంటలో అంతర పంటలుగా గోరు చిక్కుడు, బెండ, సజ్జ, అలసంద, కీరదోస, మినుము, పెసర, దోస, రక్షక పంటలుగా జొన్న వేయవచ్చని తెలిపారు. దీనివల్ల కంది పంటకు ఆశించే రసం పీల్చే పురుగు, మారకాయ మచ్చల పురుగు తెగుళ్ల ఉద్ధృతి తగ్గుతుందన్నారు. వివిధ రకాల పంటలు వేయడం ద్వారా అన్ని రకాల సూక్ష్మజీవులకు ఆవాసంగా మారి భూమి సారవంతం అవుతుందన్నారు. అంతర పంటల ద్వారా రైతుకు పెట్టుబడి ఖర్చు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా శిక్షకులు సైదయ్య, తిరుపతిరావు, ప్రకాష్ రావు పాల్గొన్నారు.

కోర్టు ఉద్యోగి సుబ్బమ్మకు నివాళి

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

మాచర్ల అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఉద్యోగి పొనుగుపాటి సుబ్బమ్మ గత శుక్రవారం జొన్నలగడ్డ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ సందర్భంగా గురువారం కోర్టు ఆవరణలోగల బార్ అసోసియేషన్ హాలులో సంతాపసభ నిర్వహించారు. ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నాయ్యమూర్తి శ్రీరాం శ్రీనివాస కళ్యాణ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి పి. ప్రశాంత్‌లు సుబ్బమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, సీనియర్ న్యాయవాదులు గట్ల సత్యనారాయణరెడ్డి, కేళం శ్రీనివాసరావు, బి.నరసింహారావు, ఎ.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎ.బాలజోజి, వై.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చీరకట్టు.. పంటలకు రక్షణ కలిగేటట్టు!

ప్రజాశక్తి - రెంటచింతల

అడవి పందుల బెడద నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. ఇందులో భాగంగా చీరలతో చుట్టూ రక్షణ కవచం ఏర్పాటు చేస్తున్నారు. మిట్ట గుడిపాడు నుంచి సమాధానంపేట వెళ్లే రహదారి వెంట మిర్చి, మొక్కజొన్న పొలాల చుట్టూ వివిధ రంగుల్లో ఉన్న చీరలను కట్టారు. పంటలు ఏపుగా పెరిగిన సమయంలో పందుల బెడద ఎక్కువగా ఉంటోంది.

వాటి నుంచి కాపాడు కునేందుకు ఇలా రక్షణకు చీరలు ఏర్పాటు చేసినట్లు స్థానిక రైతులు చెబుతున్నారు. చీరల ఏర్పాటు వల్ల అక్కడ మనుషులు ఉన్నారన్న అనుమానంతో జంతువులు, పందులు ఆ వైపునకు రావడం లేదని తెలిపారు.

జనసేన నేత మొక్కజొన్న పంట ధ్వంసం

ప్రజాశక్తి-కారంపూడి

మండలంలోని పెద్దకొదమగుండ్ల గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు మాడ రామకృష్ణ వ్యవసాయ భూమిలో పండించిన మొక్కజొన్న పంటను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో వెంటనే ఆయన ఈ విషయాన్ని జనసేన పార్టీ మాచర్ల నియోజకవర్గ సమన్వయకర్త బుసా రామాంజనేయులుతోపాటు, స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. జనసేన పార్టీ నాయకులతో కలసి ధ్వంసమైన పంటను పరిశీలించిన అనంతరం రామాంజనేయులు మాట్లాడుతూ.. అరుకాలం కష్టపడి పండించే పంటలను ధ్వంసం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని పోలీసులు గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని అయన కోరారు. బాధితుని ఫిర్యాదు మేరకు కారంపూడి సి.ఐ టి. వి. శ్రీనివాసరావు, టి. వాసు కొదమగుండ్ల చేరుకొని ధ్వంసం అయిన పొలాన్ని పరిశీలించారు.

ప్రకృతి వ్యవసాయం శ్రేయస్కరం : డీపీఎం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రకృతి వ్యవసాయ సాగు ద్వారా భూమికి, మానవాళికి సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని డిపిఎం కె.అమలకుమారి అన్నారు. నరసరావుపేట పట్టణ సమీపంలోని రెడ్డి నగర్-పోస్టల్ కాలనీ సమీపంలో ప్రకృతి సాగు విధానం అవలంబిస్తూ ఏటీఎం మోడల్ ద్వారా 2 ఎకరాలలో కూరగాయలు సాగు చేస్తున్న అభ్యుదయ రైతు కోడూరి వెంకటేశ్వర రెడ్డి పంట పొలాన్ని గురువారం ఆమె సందర్శించారు. లాభసాటి వ్యవసాయం చేస్తున్న వెంకటేశ్వరరెడ్డిని అభినందించి మరిన్ని సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నరసరావుపేట పట్టణ సమీపంలో రెండు ఎకరాల పొలంలో ఏటిఎం విధానంలో నిరంతరం ఆదాయం వచ్చే విధంగా పూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానంలో తోటకూర, చుక్కకూర, పాలకూర, గోంగూర, కొత్తిమీర, టమాట, గోరు చిక్కుడు, వంగ, మిరప, క్యాబేజీ, బెండ, తీగజాతి కూరగాయలైన బీర, సొర, కాకర, పొట్ల తదితర కూరగాయలు పండిస్తూ.. వినియోగదారులకు పొలం వద్దనే అమ్మకాలు జరుపుతూ వెంకటేశ్వర రెడ్డి ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఏ రకం కూరగాయలైనా కేజీ రూ.50, ఆకు కూర కట్ట రూ.10లకు విక్రయిన్నారని చెప్పారు. తాజాగా ఉండడంతో వినియోగదారులు పొలం వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారని ఆమె అన్నారు. ఏటిఎం విధానంలో గృహిణులు ఇంటి పరిసర ప్రాంతాలలో ఒక సెంటు ఖాళీ స్థలం ఉన్నా.. అందులో 10 రకాల కూరగాయలు ఆరోగ్యకరమైన విధానంలో పండించుకోవచ్చన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేసి అమ్మకాలు జరుపుకొనేలా రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. పల్నాడు జిల్లాలో ప్రకృతి సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

గ్రామ సచివాలయం ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సచివాలయ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రభుత్వ లక్ష్యం మేరకు పనిచేయాలని ఎంపిడిఓ టీవీ కృష్ణకుమారి ఆదేశించారు. నరసరావుపేట మండలంలోని పమిడిమర్రు సచివాలయాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులను, సిబ్బంది పని తీరును పరిశీలించి తగు సూచనలు చేశారు. గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న సచివాలయ భవనాన్ని పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సర్పంచ్ దాసరి సుధారాణి శ్రీనివాసరావు ఎంపీడీవోతో చర్చించారు. కార్యక్రమంలో ఈ.ఓ.పి.ఆర్.డి నాగనంద్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అండగా..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నిరాశ్రయులకు అండగా చర్చిస్ ఆఫ్ క్రైస్ట్ మిషన్ సొసైటీ అండగా నిలుస్తోంది. వివిధ సేవా కార్యక్రమాల ద్వారా సంస్థ డైరెక్టర్, నరసరావుపేట ఇండియన్ క్రిస్టియన్ స్కూల్ డైరెక్టర్ బొంతా భరత్ భూషణ్ నలుగురికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇటీవల గుంటూరు జిల్లా గుజ్జగుండ్లకు చెందిన బుర్రి కోటేశ్వరరావు ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలింది. ఆ ధాటికి ఇల్లు, లోపల ఉన్న సామగ్రి ధ్వంసమై సర్వం కోల్పోయిన ఆ కుటుంబానికి భరత్ అండగా నిలిచారు. నిత్యావసర సరకులు, గృహోపకరణ వస్తువులు, దుస్తులు, రూ.25 వేలు ఆర్థిక సహాయం చేశారు.

తండ్రి స్ఫూర్తితో..

పేదలకు, నిరాశ్రయులకు నిత్యం అండగా ఉండే తన తండ్రి ఏసుదాసు భౌతికంగా లేకపోయినా.. ఆయన స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు భరత్ భూషణ్ చెబుతున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా 200 మంది పేదలకు చీరలు, నిరాశ్రయులైన వృద్ధులు, యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రతి శుక్రవారం, ఆదివారం చర్చి దగ్గర పేదలకు, యాచకులకు అన్నదానం చేస్తున్నారు. మరోవైపు నరసరావుపేట పట్టణ సమీపంలోని వినుకొండ రోడ్డు జామీసన్ నగర్‌లో అత్యాధునిక నాణ్యత ప్రమాణాలతో ఇండియన్ క్రిష్టియన్ స్కూల్ నిర్వహిస్తున్నారు. పేద, తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు పెన్నులు, నోటు పుస్తకాలు, ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారు.

మాచర్లలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి

- శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్లలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి హామీ ఇచ్చారు. గురువారం మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా నిర్వహించిన ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో గెలిచిన విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయన్నారు. యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి మంచిపేరు పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. ఫైనల్లో తాళ్లపల్లి జట్టుపై గెలిచి టోర్నీ విజేతగా నిలిచిన మాచర్ల పెద్దారెడ్డి టీమ్‌కు రూ.20 వేల నగదు బహుమతితో పాటు కప్‌ను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుండాల శ్రీనివాస్ యాదవ్, నేరేటి వీరస్వామి యాదవ్, నడ్డి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ వినియోగంపై తనిఖీలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

విద్యుత్తు అక్రమ వినియోగంపై గురువారం పట్టణంలో ఆ శాఖాధికారులు తనిఖీలు చేపట్టారు. మొత్తం 47 బృందాలుగా.. 3,444 విద్యుత్తు మీటర్లను తనిఖీ చేసినట్లు ఆ శాఖ ఏఈ కిరణ్ కుమార్ తెలిపారు. అనుమతించిన కేటగిరీ కంటే వేరే కేటగిరీలో ఉండటం.. పరిమితి లోడుకు మించి అధికంగా వినియోగించడం తదితర 149 మంది వినియోగదారులను గుర్తించి, రూ.6.57 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఈ సిహెచ్ రాంభొట్ల, డీఈఈలు రవికుమార్, రాజశేఖర్, బి.వెంకటేశ్వరరెడ్డి, జిఎల్‌వి ప్రసాదరావు పాల్గొన్నారు.

చేనేత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని లగడపాడు గ్రామంలో చేనేత కార్మికుని కుటుంబానికి రూ.28,300 ఆర్థిక సాయాన్ని జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం తరఫున గురువారం అందజేశారు. గ్రామానికి చెందిన నేత కార్మికుడు భార్య సామ్రాజ్యానికి ఈ మొత్తం అందించారు. చేనేత కుటుంబాలకు అండగా ఉంటామని.. ప్రభుత్వం కూడా తమవంతుగా సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిల్లపల్లి సత్యం, గౌరవ అధ్యక్షుడు అనుముల వెంకటరావు, విశ్రాంత టీచర్ అవ్వారు రవీంద్రనాథ్ ఠాగూర్, సత్తెనపల్లి అధ్యక్షులు అనుముల పాపారావు, బిట్రా నాగరాజు, నాగేశ్వరరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు అనంత ప్రహ్లాద పాల్గొన్నారు.

రైతాంగాన్ని మోసగించిన ప్రభుత్వం

- పెట్టుబడి సాయం ఇంకెప్పుడిస్తారు?
- నేడు విజయవాడలో ధర్నా
- రైతులంతా తరలిరావాలని రైతుసంఘం పిలుపు

మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-తెనాలి

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం మోసగించిందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు విమర్శించారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు తక్షణమే అందించాలని ఈ నెల 17న విజయవాడలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ముగిసి, రబీ సీజన్ ప్రారంభమైన దశలో కూడా ప్రభుత్వం పెట్టుబడి హామీపై ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చకపోవడం దారుణమన్నారు. ఉచిత పంటల బీమా కొనసాగించాలని, బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రయత్నాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, విద్యుత్ వినియోగదారులపై అదనపు భారాలను తగ్గించాలని, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం చేపట్టే ధర్నాకు రైతులంతా తరలి రావాలని కోరారు. సమావేశంలో నాయకులు జెట్టి బాలరాజు, కె.భాస్కర్ చంద్, పి.కోటేశ్వరరావు వై.బి.రావు, వి.వెంకటరామయ్య పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

తాడేపల్లి రూరల్ : ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో రైతులతో సమావేశమయ్యారు. శుక్రవారం చేపట్టబోయే ధర్నాకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా.. నేటికి ఏ ఒక్క రైతు ఖాతాలోనూ రూ.20 వేలు పెట్టుబడి సాయం జమ చేయలేదని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని, ఇటువంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. పాడి రైతులకు పొరుగు రాష్ట్రాలలో ఇస్తున్న విధంగా లీటరుకు ఐదు రూపాయలు బోనస్ అదనంగా కలిపి ఇవ్వాలన్నారు.

తాడేపల్లి మండలంలో అధికంగా భూమిని సాగు చేస్తున్న కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి.. బ్యాంకు రుణాలు, సబ్సిడీలు అందించాలన్నారు. గుంటూరు ఛానల్ పొడిగింపునకు నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించాలని, పెద్దవడ్లపూడి హై లెవెల్ ఎత్తిపోతల పథకం తక్షణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగం సమస్యలపై శుక్రవారం ఉదయం 10 గంటలకు విజయవాడ ధర్నా చౌక్ లో జరుగు ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు అమ్మిశెట్టి రంగారావు, శివారెడ్డి, ఎనుముల సాంబయ్య, బాకీ శ్రీనివాసరావు, బద్రి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతోనే లక్ష్యసాధన

ప్రజాశక్తి-తెనాలి

నేటి సమాజంలో విద్యార్థులను పెడదోవ పట్టించే అనేక అంశాలు ఉన్నాయని, వాటన్నింటినీ అధిగమించి లక్ష్యాన్ని సాధించాలంటే ఏకాగ్రత ముఖ్యమని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు తెలిపారు. రూరల్ గ్రామం కొలకలూరు బిజెఆర్ రీడింగ్ రూమ్, పొన్నెకంటి బెంజమిన్ ప్రాంగణంలో ఆది జాంబవ దళిత్ ఎంప్లాయీస్ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి ఉపాధి అవకాశాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఐఓసిఎల్ డీలర్ యడ్లపల్లి రవి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు సభలో సుబ్బారావు మాట్లాడుతూ అట్టడుగు వర్గాలలో పుట్టి ఐఏఎస్, ఐపీఎస్‌లో టాపర్లుగా నిలిచిన వారిని, సైంటిస్టులుగా ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకొని లక్ష్యసాధనలో ముందడుగు వేయాలని సూచించారు. గ్రామంలో కరుణానిలయం విద్యాసంస్థల వ్యవస్థాపకులు పొన్నెకంటి బెంజమిన్‌పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ బహుమతులు అందజేశారు.

ప్రణాళికతో చదివితే విజయం తథ్యం

ప్రజాశక్తి-చేబ్రోలు

విద్యార్థులు లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని మండల విద్యాశాఖాధికారి ఆర్.సుబ్బారావు సూచించారు. పదో తరగతి విద్యార్థుల రెమిడీయల్ శిక్షణ తరగతులను నారాకోడూరులో జెడ్‌పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఆయన సందర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన వందరోజుల కార్యాచరణ ప్రణాళికను పరిశీలించి.. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. దత్తత తీసుకున్న విద్యార్థులపై వ్యక్తిగత పర్యవేక్షణ ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రత్యేక శిక్షణ తరగతులకు విద్యార్థులు అందరూ క్రమం తప్పకుండా హాజరు కావాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్ నాగేశ్వరావు, మాధవీలత, ఎం.వెంకటేశ్వరరావు, కృష్ణారావు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎసిసి కార్మికులకు అండగా పోరాటం : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

న్యాయబద్ధంగా తమకు రావాల్సిన నష్టపరిహారం కోసం పోరాటం చేస్తున్న ఏసీసీ కార్మికుల సమస్యను సామరస్యంగా పరిష్కరించకుంటే.. పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ఏసీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి, మాట్లాడారు. కార్మికులకు సీపీఎం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సమస్య పరిష్కారం కోసం ఐక్య పోరాటాలే మార్గమన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏసీసీ కార్మికులకు మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ కార్మికుల శ్రమ దోపిడీని అనుభవించిన యాజమాన్యం.. వారికి నష్టపరిహారాన్ని ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తూ, కార్మిక కుటుంబాలను ఇబ్బందులు పాల్జేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీక్షల్లో ఎస్‌కే ఇమాంబి, ధనమ్మ, బూదెమ్మ, ఎస్.శాంతమ్మ, యు.రమణ, తదితరులు కూర్చున్నారు.

ఆర్టీసీ ప్రయాణికుల భద్రత... చోదకుల బాధ్యత

ప్రజాశక్తి-తెనాలి

ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత డ్రైవర్లదేనని డీఎస్పీ బి.జనార్ధనరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో గురువారం నిర్వహించిన రోడ్డు భద్రత మాసోత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డిపో మేనేజర్ రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరిమితికి మించిన వేగం, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపడం ప్రమాదకరమన్నారు. ప్రజా రవాణాకు ఉపయోగపడే ఆర్టీసీలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. కమిషనర్ బి.శేషన్న మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణం క్షేమకరమైందన్నారు. తహసీల్దార్ కెవి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణం సుఖవంతమైనదని, అదే సమయంలో ప్రైవేట్ వాహనాలతో పోల్చుకుంటే అన్ని వర్గాలకు చార్జీలు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. ఎంవీ ఐటీ రాఘవరావు మాట్లాడుతూ గత ఏడాది రోడ్డు ప్రమాద గణాంకాలను వివరించారు. అతిథులను డిపో మేనేజర్ రాజశేఖర్ సత్కరించారు. కార్యక్రమంలో డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

యార్డులో కాటాల తనిఖీ

ప్రజాశక్తి-దుగ్గిరాల

స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో గురువారం సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు సమక్షంలో కాటాలు తనిఖీ చేసి సీల్ వేశారు. ఏటా విధిగా ఇక్కడ కాటాలను తనిఖీ చేస్తుంటారు. అనంతరం సీలు వేస్తారు. మరలా ఏడాది వీరి సమక్షంలో పరిశీలించే వరకూ ఎవరూ తెరవడానికి వీలు లేదు. ప్రస్తుతం యార్డులో 19 ఎలక్ట్రానిక్ కాటాలు పనిచేస్తున్నాయి. కాటాలను పరిశీలించి సీలు వేయడం వల్ల తూకంలో ఎటువంటి పొరపాట్లూ జరగకుండా ప్రభుత్వం ఈ చర్య చేపట్టిందని సిబ్బంది చెబుతున్నారు.

కుమార్ రాజుకు 'తెలుగు కీర్తి' పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు

శ్రీశ్రీ కళా వేదిక ఉపాధ్యక్షుడు, కవి, రచయిత బుర్రి కుమార్ రాజు తెలుగు కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు శ్రీశ్రీ కళా వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి నుంచి సమాచారం అందుకున్నట్లు కుమార్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. అవార్డుకు ఎంపిక చేయడంపై ప్రతాప్, రమావతిలకు కృతజ్ఞతలు తెలిపారు. పురస్కారాన్ని విజయవాడలో ఈ నెల 21న కౌతా పూర్ణానంద విలాస్ కళా వేదిక వద్ద జరగనున్నట్లు కార్యక్రమంలో అందుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలియజేశారు.

అయ్యయ్యో.. బ్రహ్మయ్యా!

- నడవలేని స్థితిలో వృద్ధుడు
- రోడ్డు ప్రమాదంతో మారిన జీవితం
- మూడు చక్రాల బండి సాయం చేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-మంగళగిరి

కూలి పనులు చేసుకుంటూ, ఉన్న దాంతో సరిపెట్టుకుంటూ, భార్యతో కలసి సాఫీగా సాగిపోతున్న ఓ వృద్ధుడి జీవితాన్ని రోడ్డు ప్రమాదం తలకిందులు చేసింది. ఇటు ఉపాధి కోల్పోయి, అటు నడవలేక దీనస్థితిలో కాలం వెల్లదీస్తున్నాడు. దాతలు స్పందించి తనకు మూడు చక్రాల బండి అయినా ఇప్పించాలని వేడుకుంటున్నాడు. మంగళగిరి 28వ వార్డు గాంధీనగర్‌కు చెందిన బూసి బ్రహ్మయ్య అనే వృద్ధుడు కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. సుమారు రెండేళ్ల క్రితం అనారోగ్యానికి గురై ఎయిమ్స్‌కు వెళ్లే క్రమంలో ఆటో కోసం వేచి ఉన్నప్పుడు.. ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో బ్రహ్మయ్య కాలుకు తీవ్ర గాయమైంది. కాలికి వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. నరాలు స్తంభించి కాలు పని చేయడం మానేసింది. దీంతో రెండేళ్ల నుంచి నడక లేక, దేకుతూనే తన పనులు చేసుకుంటూ వస్తున్నాడు. తిరిగి పని చేసుకునే అవకాశం ఎలానూ లేకపోయిందని.. కనీసం బయటికి వెళ్లేటప్పుడు అయినా ఇబ్బంది లేకుండా ఉండటానికి దాతలు దయతో తనకు మూడు చక్రాల బండిని ఇవ్వాలని బ్రహ్మయ్య అభ్యర్థిస్తున్నాడు.

సిపిఎం అభిమాని కృష్ణ కన్నుమూత

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని ఉండవల్లి గ్రామానికి చెందిన సిపిఎం సానుభూతిపరులు నల్లగొర్ల కృష్ణ (74) గురువారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కృష్ణ మృతి వార్త తెలుసుకున్న సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, టి.బక్కిరెడ్డి, ఆర్.రాఘవయ్య, చాటగడ్డ సుందర్ రావు, టిడిపి తాడేపల్లి పట్టణ కార్యదర్శి వల్లభనేని వెంకట్రావు, టిడిపి నాయకులు తమ్మా శంకర్ రెడ్డి, గాదె వినయ్, కోటేశ్వరరావు, రామారావు తదితరులు మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి - అమరావతి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతిలో రాష్ట్ర నలుమూలల నుంచి నిత్యం వచ్చే భక్తుల సౌకర్యార్థం శాంతిభద్రతలను నిరంతర పర్యవేక్షించనున్నట్లు సీఐ అచ్చయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు అమరావతి ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ అంతరాయం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు.

ఉపగ్రహాల అనుసంధానం గొప్ప మైలురాయి

ప్రజాశక్తి-గుంటూరు : స్పెడెక్స్ ఉపగ్రహాల అనుసంధాన ప్రక్రియ విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ వ్యవస్థాపకులు జి.శాంతమూర్తి గురువారం ఒకప్రకటనలో అభినందనలు తెలిపారు. భారతదేశ అంతరిక్ష పరిశోధనలో అంతరిక్షంలో ఉపగ్రహాలను చాగా, టార్గెట్ డాకింగ్ చేయటం ఒక గొప్ప మైలురాయి అన్నారు. డాకింగ్ చేయటంలో భారత దేశంలో నాలుగో స్థానంలో నిలిచిందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఇస్రో మరెన్నో గొప్ప విజయాలు సాధించి, భారతదేశ ప్రతిష్టను ప్రపంచానికి చాటి చెబుతుందన్నారు.

19న గురజాలలో కిమ్స్ శిఖర హాస్పిటల్ ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

కిమ్స్ శిఖర హాస్పిటల్స్ గుంటూరు ఆధ్వర్యంలో జనవరి 19న గురజాల పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్లో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ చిట్టెం లక్ష్మణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గుండె, మెదడు, నరాలు, పక్షవాతం, జీర్ణకోశ వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, కిడ్నీ సంబంధిత వ్యాధులు, ఎముకులు మరియు కీళ్ల వ్యాధులు, జ్వరాలు, చిన్న పిల్లల వ్యాధులు, స్త్రీ మరియు ప్రసూతి వ్యాధులు, షుగర్, థైరాయిడ్, రక్తపోటు వంటి సమస్యలపై నిష్ణాతులైన సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు సేవలు అందిస్తారన్నారు.అలాగే ఈశిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో (గుండె స్కానింగ్) బిఎండి (ఎముకల సాంద్రత పరీక్ష), బిఎంఐ (ఊపిరితిత్తుల సామర్థ్య) పరీక్షలు నిర్వహిస్తామని, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలియజేశారు. కావున ఈ వైద్యశిబిరంలో పాల్గొనదలచిన వారు వారి పాత వైద్య పరీక్షల రిపోర్టులు వెంట తీసుకురావాలని సూచించారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ఇతర వివరాల కోసం 8309713983 నంబర్లో సంప్రదించాలన్నారు.

బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి, ఇతర అధికారులు

రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో రహదారి భద్రతపై జనవరి 16 నుండి ఫిబ్రవరి 15 వరకూ జరిగే జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో వాహనదారులకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులకు సూచించారు. గురువారం కలక్టరేట్లో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు-2025కు సంబంధించిన రూపొందించిన బ్రోచర్లు, కరపత్రాలు, బ్యానర్లను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రతపై వాహనదారులు, స్టేక్ హెూల్డర్స్ కు అవగాహన కల్పించాలని ఉప రవాణా కమిషనర్ సీతారామి రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ షేక్. ఖజావలి , డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, ఆర్డిఓ శ్రీనివాస రావు, జెడ్పి సిఇఓ జ్యోతిబసు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశం లో మాట్లాడుతున్న ఎంఎల్ఎ రామాంజనేయులు

పేదరిక నిర్మూలనకు కృషి : ఎమ్మెల్యే రామాంజనేయులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చంద్రబాబు ప్రతిపాదించిన పి4 ఫార్ములాను ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో అనుసరించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. జిల్లా టిడిపి కార్యాలయంలో ఎన్.ఆర్.ఐలు, సుదూర ప్రాంతాలలో ఉన్న పార్టీ శ్రేయోభిలాషులతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ పి4 అంటే ఆర్థికంగా వెనుకబడిన అన్ని వర్గాలు వారిని ఆదుకోవడమే అనే అంశాన్ని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. చంద్రబాబు గత ఎన్నికల సమయంలో అరాచక పాలనకు స్వస్తి పలకాలని ఇచ్చిన పిలుపుతో ఎన్.ఆర్.ఐ మరియు ఎన్.ఆర్.వి మిత్రులు ముందుకు వచ్చి విజయాన్ని ఇచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగ, ఉపాధి రీత్యా సుదూర ప్రాంతాలకు వెళ్లిన ప్రతి ఒక్కరూ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రత్యేకంగా వచ్చి కూటమి ప్రభుత్వ విజయం కోసం పోరాటం చేయడం చూస్తే సుపరిపాలన వచ్చిందని గుర్తు చేశారు. విదేశాల నుంచి ఎన్నో వ్యయప్రయాసలకు ఎదురొడ్డి కూటమి ప్రభుత్వం విజయానికి సహకరించారని తెలిపారు. 2047 సవత్సరానికి పి4 ఫార్ములతో పేదరికం లేని సమాజాన్ని నిర్మించడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు రూ.10 కోట్లతో ఐటి టవర్ నిర్మిస్తే నేడు ప్రపంచంలో మొదటి స్థానంలో ఉందన్నారు. చదువుకొనే విద్యార్థుల కోసం ఎన్ ఆర్ ఐ మిత్రులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో సాగునీటి, తాగునీటి ఎద్దడి లేకుండా చేస్తామన్నారు. టిడిపి నాయకులు ఆలోకం శ్రీరాం, భీమినేని వందనాదేవి, కొర్రపాటి నాగేశ్వరరావు, దేవతోటి నాగరాజు, జంపని హనుమంతరావు, కొల్లా వీరయ్య చౌదరి, గింజుపల్లి వెంకటేశ్వరరావు, కల్లూరి శ్రీనివాసరావు, నువ్వుల సునీల్, గింజుపల్లి శివరాంప్రసాద్, మన్నవ పూర్ణచంద్రరావు, ఎన్.ఆర్.ఐలు కార్తికేయ చౌదరి, అనిల్ చౌదరి, కాకర్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు అవకాశం

21లోగా పిఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్కిల్‌డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా పిఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంపై రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజతో కలసి గురువారం కలక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థఆధ్వర్యంలో ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి కృషి చేస్తుందని, ఇందులో భాగముగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందన్నారు. యువతలో నైపుణ్యాల్ని పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించటానికి ప్రధానమంత్రి పిఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్/స్కీమ్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవరావు మాట్లాడుతూ ఈ స్కీమ్‌కు పదోతరగతి, పాలిటెక్నిక్, ఐటిఐ, బిఎ, బిఎస్సీ, బిఫార్మసీ, బిబిఎ, బి.టెక్ డిగ్రి ఉండి, 21-24 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. https://pminternship.mca.gov.in/login వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ ప్రోగ్రామ్‌కు ఎంపికైన వారికి వన్‌టైమ్ ఇన్సిడెంట్ గ్రాంట్ రూ.6వేలు, భారత ప్రభుత్వం ద్వారా నెలవారి సహాయం రూ.4,500లు, పరిశ్రమల ద్వారా రూ.500 సంవత్సరం పాటు అభ్యర్థులకు ఆర్థిక సహాయం అందిస్తారన్నారు. ఇంటర్న్ షిప్‌లో చేరే వారికి వ్యక్తిగత బీమా సౌకర్యం ఉందని, ఇప్పటికే ఉన్న పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన, పీఎం సురక్షా బీమా యోజన వంటి కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల ద్వారా ఇన్సూరెన్స్ కల్పిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 21వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. అదనపు సమాచారం కోసం ఏపీఎస్ఎస్‌డిసి కమాండ్ కంట్రోల్ 91-998853335, 87126 55686, 8790118349, 8790117279, స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ జి.వి.ఎస్. సాయికుమార్ 8074597926 నంబర్‌లో సంప్రదించాలని తెలియజేశారు. కార్యక్రమంలో డీఆర్ఓ షేక్. ఖజావలి , డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, ఆర్డిఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి, ఇతర అధికారులు

జిందాల్ ప్లాంట్‌ను పరిశీలించిన డిఎంఎ

ప్రజాశక్తి-గుంటూరు

ఘనవ్యర్థాల నిర్వహణ పటిష్టంగా, ప్రణాళికాబద్దంగా చేపట్టినప్పుడే రోజువారి ఉత్పత్తి అవుతున్న వ్యర్థాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర పురపాలన సంచాలకులు (డిఎంఎ) హరి నారాయణన్ అన్నారు. గురువారం నాయుడుపేటలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ జి.సూరజ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎంఎ తొలుత జిందాల్ ప్రతినిధులతో ప్లాంట్ సామర్థ్యం, అవసరమైన వ్యర్థాలు, ఏమున్సిపాలిటీల నుండి ఎంత చెత్త వస్తుంది, ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుంది, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్లాంట్‌లోని ట్రిప్పింగ్‌ఫ్లోర్, గ్రాప్ కంట్రోల్ రూమ్, బాయిలర్ 25 మీటర్, నెస్ట్‌ట్రిప్పింగ్‌ఫ్లోర్, బాయిలర్ 8 మీటర్, ఇన్సరేటర్, డిసిఎస్ కంట్రోల్‌రూమ్, టిజి హాల్‌ను పరిశీలించారు. అనంతరం డిఎంఎ మాట్లాడుతూ నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల్లో వ్యర్థాల నిర్వహణ పెద్ద సమస్యగా ఉందని, ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలను ఒక చోట డంప్ చేయడం ద్వారా స్థలాభావ సమస్య కూడా ఎదురవుతుందన్నారు. వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ద్వారా వ్యర్థాల నిర్వహణ, వ్యర్థాల ద్వారా విద్యుత్ తయారీ ద్వారా వ్యర్థాలకు సమర్థవంతమైన పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జిందాల్ ప్రాజెక్ట్స్ ఏపి ప్రెసిడెంట్ ఎంవి.చారి, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఈఈ సుందర్రామిరెడ్డి, డిఈఈ సతీష్ పాల్గొన్నారు.

ప్లాంట్‌ను పరిశీలిస్తున్న డిఎం, ఇతర అధికారులు

కమిషనర్ తీరుపై వైసిపి ధ్వజం

అహంకారంతో వ్యవహరిస్తున్నారు : అంబటి
ప్రజా పోరాటం చేస్తాం : అప్పిరెడ్డి
మేయర్ స్థానాన్ని అగౌరపరిచారు : కావటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నగర పాలక సంస్థ కమిషనర్ పులిశ్రీనివాసులు తీరుపై వైసిపి కార్పొరేటర్లు, నాయకులు మరో సారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక సింధూరి హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్ నాయుడు, డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు, 30 మంది కార్పొరేటర్లు, ఇతర నాయకులు హాజరు అయ్యారు. సమావేశం వాడీవేడిగా జరిగింది. కమిషనర్ చర్యలను కార్పొరేటర్లు తప్పుపట్టారు. ఆయన తీరుపై న్యాయపోరాటం చేస్తామన్నారు. సమావేశం తరువాత అంబటి రాంబాబు, అప్పిరెడ్డి, కావటి మనోహర్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ ఈనెల 4న జరిగిన సమావేశంలో ఒక కార్పొరేటర్లు చేసిన వ్యాఖ్యలపై చట్టవిరుద్ధంగా కమిషనర్ బాయ్‌కాట్ చేశారని తెలిపారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ. కమిషనర్ చట్ట వ్యతిరేక నిర్ణయాలపై ఉద్యమిస్తామన్నారు. విజయవాడలో వరదలు వచ్చిన సమయంలో బుడమేరు పరిసరాల్లో సహాయ కార్యక్రమాల పేరుతో రూ.9.24 కోట్లు నిధులు దుర్వినియోగం జరిగాయని, అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చాయని వీటిని కౌన్సిల్‌లో ప్రస్తావిస్తారనే కారణంతో కమిషనర్ సమావేశాన్ని బాయ్‌కాట్ చేసి వెళ్లారన్నారు. మేయర్ ప్రమేయం లేకుండానే సంకురాత్రి సంబరాలను నిర్వహించారని, మేయర్‌ను, కార్పొరేటర్లను ఎందుకు పిలవలేదన్నారు. కమిషనర్ మూడేళ్ల తరువాతే రిటైర్ అయినా చట్టం మిమ్మల్ని నిలబెడుతుంది.వదిలిపెట్టదని హెచ్చరించారు. ప్రజా ప్రతినిధులు సభ నుంచి వాకౌట్ చెసే అధికారం అధికారులకు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. మేయర్ మాట్లాడుతూ ఈనెల 4న సమావేశం నుంచి వెళ్లిపోయిన తరువాత తాను స్వయంగా ఫోన్ చేసినా స్పందన లేదని, అభివృద్ధి పనులు ఆమోదానికి సహకరించాలని కోరినప్పటికీ స్పందన లేదన్నారు. మళ్ళీ 17న సమావేశం పెట్టమని 7వ తేదీ న లిఖిత పూర్వకంగా లేఖ పంపామని ఇంత వరకు ఎటువంటి ప్రకటన రాలేదన్నారు. వాయిదా పడిన సమావేశం తిరిగి మూడు రోజుల్లో సమావేశం పెట్టమని కోరినా ఇంతవరకు స్పందన లేదని తెలిపారు. సమావేశం పెట్టే పూర్తి హక్కు మేయర్ కి ఉందని తెలిపారు. ప్రథమ పౌరుడి పేరు తనను కించపర్చారని తెలిపారు. ఆహ్వానం పత్రిక లో తన పేరు లేదన్నారు. చట్ట ప్రకారం వెళ్తామని వెల్లడించారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ అనేక రాజకీయ పార్టీలు ప్రాతినిధ్యం వహించిన గుంటూరు కౌన్సిల్‌లో ఈ తరహా కమిషనర్‌ను ఎప్పుడూ చూడలేదన్నారు. కౌన్సిల్ నీ అవమాన పరిచిన అధికారులు తీరును ఖండిస్తున్నామని తెలిపారు. కౌన్సిల్‌లో సంఖ్యాపరంగా తమకే మెజార్టీ ఉందని, అధికారుల వెనుక టిడిపి నేతల ఉండి ఆడిస్తున్నారని తెలిపారు. తాము ప్రజా సమస్యలపై పోరాడుతూనే తమ హక్కుల కోసం పోరడతామని వెల్లడించారు.

మాట్లాడుతున్న మేయర్ కావటి మనోహర్ నాయుడు, అప్పిరెడ్డి, అంబటి

ఎన్‌సిసి క్యాడెట్లకు ట్రెక్కింగ్ శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్‌సిసి గుంటూరు గ్రూప్, 10 ఆంధ్ర గరల్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి కేడెట్లు మొదటిసారిగా ట్రెక్కింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్లు గుంటూరు ఎన్‌సిసి గ్రూప్ కమాండర్ కర్నల్ ఎస్.ఎం.చంద్రశేఖర్ తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని క్యాడెట్స్ గురువారం వివిధ ప్రాంతాల నుండి శిబిరానికి వేదికైన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ అఖిల భారత మహిళ ట్రెక్కింగ్-3 పేరుతో ఈనెల 16 నుండి 23 వరకు జరిగే ఈ శిబిరంలో కొండవీడు కొండ, ఫిరంగిపురం కొండ, కోటప్ప కొండ లను ఎన్‌సిసి కేడెట్లు ట్రెక్కింగ్ చేస్తారని పేర్కొన్నారు. పక్షుల కేంద్రముతో పాటు ఉమ్మడి గుంటూరు, కష్ణాజిల్లాలోని పలు ప్రాంతాలను సందర్శిస్తారన్నారు. ఆంధ్ర తెలంగాణలోని 9 ఎన్‌సిసి గ్రూపులకు చెందిన సుమారుగా 600 మంది విద్యార్థులు ట్రెక్కింగ్ చేస్తారన్నారు.

వివిధ ప్రాంతాల నుండి క్యాంప్‌నకు వచ్చిన మహిళా క్యాడెట్లు